ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం

విద్యారంగ

ఎడిటివి ఫీచర్
శ్రీకాళహస్తి- గూడూరు

ప్రత్యేక సంచిక

24.06.2023 శనివారం

విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించాలి

ప్రజాశక్తి -ఎస్ఆర్ పురం

విద్యార్థులకు విద్యా సామాగ్రిని దాతలు జీకే కన్స్ట్రక్షన్స్ బెంగళూరు వ్యవస్థాపకుడు కిషోర్ నాయుడు ఆధ్వర్యంలో త్యాగరాజుల నాయుడు, కుమారి దంపతులు వారి కుటుంబ సభ్యులు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు అందజేశారు. వివరాలు ఇలా.... ఎస్ఆర్ పురం మండలంలోని కటిక పల్లి గ్రామపంచాయతీ పిల్లి గుండ్లపల్లి దళితవాడలో ప్రాథమిక పాఠశాలలోని ఒకటవ తరగతి నుంచి 5వ తరగతి వరకు విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు విద్యా సామాగ్రి అందిస్తున్నట్లు తెలిపారు. పేద పిల్లలు బాగా చదివి ఉన్నత విద్యను అభ్యసించాలని ఉద్దేశంతో తన వంతు సహాయ సహకారాలు అందించాలని పాఠశాలను సందర్శించారు. ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవి ,ఉపాధ్యాయులు మురళి ,కటికపల్లి మాజీ సర్పంచ్ బాబు నాయుడు మాజీ ఎంపీటీసీ కేఎం రవి కిషోర్ నాయుడు తల్లిదండ్రుల చేతులు మీదుగా పిల్లలకి విద్యా సామాగ్రిని అందించి మిఠాయిలు పంచారు . ఈ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మల్లికా, గ్రామ పెద్దలు షణ్ముగం, శాంతి కుమార్ దేవరాజులు గంగాధరం , పవన్ కుమార్, దేవి తదితరులు పాల్గొన్నారు.



రామకృష్ణాపురంలో 'వైఎస్ఆర్ కంటి వెలుగు' సేవలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: రామకష్ణాపురం గ్రామ పంచాయతీలోని సచివాలయంలో శుక్రవారం వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సర్పంచ్ విరిత ఆధ్వర్యంలో కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైసీపీ నాయకులు దేవేంద్రరెడ్డి, మెడికల్ ఆఫీసర్, పంచాయతీ కార్యదర్శి మునినరేష్ కుమార్, మహిళా పోలీస్ మీనా, ఏఎన్ఎం తనుజా, వాలంటీర్లు జయచంద్ర, హేమాద్రి, మహిత, వాలంటీర్లు పాల్గొన్నారు.

రెయిన్బో పాఠశాలలలో
ఉల్లాసభరితమైన విద్యాబోధన



ప్రజాశక్తి-రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని రెయిన్బో గ్రూప్ ఆఫ్ స్కూల్లో ఉల్లాసభరితమైన.. ఒత్తిడిలేని విద్యను అందిస్తున్నామని పాధ్యాయులని కరస్పాండెంట్ అతా ఉల్లా ఖాన్ తెలిపారు. పట్టణంలోని జీఎం స్ట్రీట్లో, బుగ్గ వీధిలో ఉన్న రెయిన్బో ఇంగ్లీష్ మీడియం హైస్కూల్లో ఆయన 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. నర్సరీ, ఎల్కేజీ, యూకేజీ విద్యార్థులకు ఒత్తిడి లేని ప్లే వే మెథడ్లో ఉల్లాసభరితంగా విద్యాబోధన అందిస్తున్నారని.. ఒకటి నుంచి పదో తరగతి వరకు లైఫ్ స్కిల్స్ పెంచేందుకు ఐఐటీ లక్ష్యసాధనతో విద్యాబోధన చేస్తున్నామన్నారు. తమ విద్యార్థులు విజయం సాధించడంలో అన్నింట్లో ముందుంటారని.. విద్యార్థులు ఏటా ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధిస్తారని తెలిపారు. ఈ ఏడాది పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు అత్యధిక మార్కులతో 100 శాతం ఉత్తీర్ణత సాధించారన్నారు. సుష్మిత 600 మార్కులకు గాను 588, వెంకట, అభినవ్, సుజిత్ 586, లుబానా కౌసర్ 586, చార్విత రెడ్డి 586, మయాన్ కుమార్ 582, ముస్కాన్ 580, యోగేష్ 578, సాయి యోగిత 576, అబ్దుల్ రహీం 574, సుప్రియ 573, జయంతి కుమార్ 573, శాలిని, ప్రియా 572, లాలూష్ 572, అబ్దుల్ రెహమాన్ 571, ఆసీన్ 569, రూపశ్రీ 567, శేఖర్ రెడ్డి 565, సాయి ప్రసాద్ 564, ఆశాజ్యోతిక 564, మోహన్ కష్ణ 563, వేద వర్షిని 558, సంజన 559, పవన్ కుమార్ 557, సాయి వెంకటేష్ 556, విక్రమ్ 556, తేజశ్రీ 554, మౌనిక మణికంఠ 553, తహజన 550, తులసి 554, దీక్షిత 539, సాయి అంజి కుమార్ 539, జిత్యశ్రీ 531, చందన ప్రియ 530, షరీఫ్ 530, గుణ, సాయి, గణేష్ 529, జ్యోతిర్మయ్ 528, ప్రేమ్ స్వరూప్ 523, జ్యోతిలక్ష్మి 520, లక్షణ్ కుమార్ 520, షాహిద్ ఆఫ్రిది 517, నస్రిన్ తాజ్ 513, జస్వంత్ 509, యాస్మిన్ 508, తస్మియా భాను 505, కెపి రాహుల్ 503, రయాన్ 503, జోసెఫ్ 502 మార్కులు సాధించి ప్రతిభ చూపారన్నారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని.. వివరాలకు 0877 2275319, 9247057313, 0877 2271384, 9704839381 నంబర్లను సంప్రదించాలని కోరారు.

వైద్యసేవే ఆత్మసంతృప్తి
డాక్టరు జగదీష్



ప్రజాశక్తి-తిరుపతి సిటీ

రోగులకు వైద్యసేవలు అందించడం ద్వారా తనకు ఆత్మసంతృప్తి అందుతుందని ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్యనిపుణులు డాక్టరు గుడారు జగదీష్ తెలిపారు. డాక్టర్సడే సందర్భంగా ఆయన తన అనుభవాన్ని వెల్లడించారు. 1983లో టిటిడిలో వైద్య వృత్తిని ప్రారంభించిన ఆయన అనంతరం 1985లో స్థాపించిన బర్డ్ ఆసుపత్రిలో 2019 వరకు విధులు నిర్వహించారు. తన పదవీకాలంలో లక్షా 40వేలకు పైచిలుక శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించారు. మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు ఆశయాలకు అనుగుణంగా స్థాపించిన బర్డు ఆసుపత్రిలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లోనే కాకుండా దేశంలోనే అన్ని రాష్ట్రాల్లో అంగవైకల్యంతో బాధపడుతున్న చిన్నారుల నుంచి ఎముకలు, కీళ్ల సమస్యలతో బాధపడే వృద్ధుల వరకు శస్త్రచికిత్సల ద్వారా ఉపశమనం చేకూర్చానని తెలిపారు. తిరుపతిలోని బర్డు ఆసుపత్రిలో 350 పడకల ప్రపంచస్థాయి అత్యుత్తమ ఆర్థోపెడిక్ హాస్పిటల్గా తీర్చిదిద్దారు. పదవీ విరమణ అనంతరం తన సేవలను పేదలకు మరింత చేరువ చేసేందుకు ఆయన తన సేవలను విస్తరించారు. తిరుపతిలోని రాస్ స్వచ్ఛంద సంస్థ, వెంకటగిరి, కరేడు, ఒంగోలు, గుంటూరు, వడ్డమూడి, విజయవాడ, హైదరాబాద్లోని ఇమేజ్ ఆర్థోపెడిక్ ఆసుపత్రిలోనూ తన సేవలను అందిస్తున్నారు. ఆయన సేవలను గుర్తించిన ఎన్టీఆర్ శతజయంతి ఉత్సవ సమితి చిత్తూరు జిల్లాలో ప్రజలకు విశేష సేవలందించిన వ్యక్తులకు ఇచ్చే ఎన్టీఆర్ పురస్కారాన్ని మొట్టమొదటిగా ఆయనకు అందజేశారు. మాజీ కేంద్ర మంత్రి, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులైన పురందరేశ్వరి, దగ్గుబాటి వెంకటేశ్వరరావు ఆయన్ని ఈ అవార్డుకు ఎంపిక చేశారు. ఇటీవల తిరుపతి కేంద్రంలో ఎస్వి యూనివర్శిటీలోని శ్రీనివాస ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి ఎన్వి.రమణ చేతుల మీదగా ఆయనకు ఈ అవార్డును అందజేశారు.

ఉత్తమ ఫలితాలే శ్రీసాయి లక్ష్యం





ప్రజాశక్తి-రేణిగుంట: ఉత్తమ ఫలితాల సాధనకు శ్రీ సాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ కరస్పాండెంట్ సాయిరాం తెలిపారు. రేణిగుంట గౌరీ నగర్లోని స్కూల్ ప్రాంగణంలో ఆయన శుక్రవారం 'ప్రజాశక్తి'తో మాట్లాడుతూ శ్రీ సాయి ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ భవ్యమైన భవిష్యత్తుకు ప్రత్యక్ష సాక్ష్యమని.. అందుకు పరీక్ష ఫలితాల్లో నిదర్శనమన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో తమ విద్యార్థులు భవ్యశ్రీ 600 మార్కులకు గాను 573, లాస్యశ్రీ 564, రేఖశ్రీ 542 , మొహమ్మద్ ఇసుఫ్ 538, రక్షిత 528, తోషాన్ 521, యశ్వంత్ సాయి 519 మార్కులతో ఉత్తమ ఫలితాలు సాధించామన్నారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయులచే విశాలమైన ప్రాంగణంలో మంచి వాతావరణంలో విద్యార్థులకు విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు. అడ్మిషన్లు జరుగుతున్నాయని .. వివరాలకు 9440479822 నంబర్ను సంప్రదించాలన్నారు. అనుభవం కలిగిన సీనియర్ ఉపాధ్యాయులచే బోధన, మినరల్ వాటర్ సౌకర్యం, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ ,విశాలమైన తరగతి గదులు, యాక్టివిటీ ఆధారిత బోధన, సైన్స్, కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

'మా నాయకుడే గెలుస్తాడు'



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రానున్న సాధారణ ఎన్నికల్లో తమ నాయకుడే ఎమ్మెల్యేగా గెలుపొందుతాడని, అలా కాకుంటే రాజకీయ సన్యాసంతో పాటు ఊరొదిలి వెళ్తామంటూ అధికార వైసిపి, ప్రతిపక్ష టీడీపీ ఎస్సీ విభాగం నాయకులు సవాల్ విసురుకున్నారు. స్థానిక శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్ కార్యాలయంలో వైసీపీ ఎస్సీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు గాదిపాకుల కిరణ్, టిడిపి ఎస్సీ సెల్ పట్టణాధ్యక్షుడు కూలి సన్నీ శుక్రవారం సంయుక్తంగా మీడియా సమావేశం నిర్వహించారు. 2024 ఎన్నికల్లో తమ నాయకుడు బియ్యపు మధుసూదన్ రెడ్డి మరోసారి 50 వేలకు పైగా ఓట్ల మెజారిటీతో గెలుపొందడం ఖాయమని గాదిపాకుల కిరణ్ జోస్యం చెప్పారు. అలా జరగకుంటే కూలి సన్నీ చెప్పినట్లుగా తాను రాజకీయ సన్యాసం పుచ్చుకోవడమే కాకుండా శ్రీకాళహస్తిని వదిలిపోతానంటూ అంగీకార పత్రాన్ని మీడియా ముందు ఉంచారు. ప్రతిగా కూలి సన్ని స్పందిస్తూ తన సవాలును స్వీకరించినందుకు కిరణ్ కు అభినందనలు తెలియజేశారు. సవాలుకు నేను కట్టుబడి ఉన్నానని, వచ్చే ఎన్నికల్లో సుధీర్ రెడ్డి గెలవకపోతే రాజకీయ సన్యాసం తీసుకోవడం, ఊరొదలి వెళ్లడం ఖాయమని స్పష్టం చేశారు.

హంద్రీ-నీవా నీళ్లివ్వకపోవడం దారుణం
రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి



ప్రజాశక్తి-గుడిపల్లి: కుప్పానికి హంద్రీ-నీవా నీళ్లివ్వకపోవడం దారుణమని.. కుప్పం నియోజకవర్గానికి ఏడు సార్లు ఎమ్మెల్యేగా ఉండి చంద్రబాబునాయుడు ఏమి చేశారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. శుక్రవారం గుడిపల్లి మండలంలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మొదటగా పల్లెబాట కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కుప్పం నియోజకవర్గానికి చంద్రబాబు ఏమి చేశారని.. నియోజకవర్గంలోని నిరుద్యోగ యువత బెంగళూరుకు వలసలు వెళ్తూ జీవనోపాధి పొందుతున్నారని.. కనీసం యువతకు ఉపాధి కల్పించారా అని ప్రశ్నించారు. చంద్రబాబు కల్లిబొల్లి మాటలు వినకుండా ఈసారి ఎమ్మెల్సీ భరత్ను ఎమ్మెల్యేగా గెలిపించారంటే మంత్రి పదవి ఇప్పించి కుప్పం నియోజకవర్గానికి అన్నివిధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు. 12 పంచాయతీల్లో పల్లెబాట కార్యక్రమం నిర్వహించి సమస్యలు అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు చేపట్టారు. ఎమ్మెల్సీ సిపాయి సుబ్రమణ్యం, కుప్పం నియోజకవర్గ ఇన్చార్జి, ఎమ్మెల్సీ భరత్, చిత్తూరు జిల్లా జడ్పీ ఛైర్మన్ శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్మన్ సుధీర్, సర్పంచులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొన్నారు.

మేము పిల్లలం - మాకు స్వేచ్ఛ కావాలి



ప్రజాశక్తి - పలమనేరు

మీ దుఃఖాన్ని మరిపించేది ఎవరు? మీ అలసటను తీర్చేదెవరు? మీ ఇంటిని నవ్వులతో నింపేదెవరు? మీ నవ్వుని చిరకాలం నిలిపేదెవరు? మేమే కదా మా చిన్నారులమే కదా? అలాంటి చిన్నారులమైన మేము అనేక సమస్యలు ఎదుర్కొంటామని మీకు తెలుసా? మేము ఎదిగేటప్పుడు మాపై ఎన్ని ఆంక్షలు ఉన్నాయో మీకు తెలుసా? "నేనెక్కడ ఆడాలి? నేనెక్కడ గెంతాలి? నేనెక్కడ పాడాలి? మాట్లాడితే అమ్మకు కోపం. నేనెవరితో మాట్లాడాలి? నోరు మెదిపితే నోరు ముయ్యి అంటారు. ఆట్లాడితే నాన్నకు కోపం. కాళ్లు కదిపితే కూర్చోమంటారు. మీరే చెప్పండి. నేనేం చేయాలి?. నేను ఎక్కడికి వెళ్ళాలి?

మేము పిల్లలం కదా, మా ప్రపంచం ఎంతో చిన్నది. మా ఆనందం, మా ఆసక్తి, మా ఆకాంక్షలు ఎంతో చిన్నవి. ఎంత చిన్నదైతేనేం మా ప్రపంచం మాకు ఎంతో అద్భుతమైనది. సంపూర్ణమైంది. ఎంత చిన్నదైతేనేం మా అనుభవాలు మాకు మహత్తరమైనవి. మేము మరువలేనివి.

మీరు (పెద్దలు) మీకు తెలుసో తెలియకో మమ్మల్ని (పిల్లలు) మా ప్రపంచం నుండి దూరం చేస్తూ ఉంటారు. మా లోకాన్ని చులకన చేస్తూ ఉంటారు. మీ పెద్దల ప్రపంచం భవిష్యత్తు మా చిన్న ప్రపంచం మీదే ఆధారపడి ఉంటుందని మీరు మర్చిపోతూ ఉంటారు. మీరు మాతో కలిసిపోయి మాలాగ అనుభూతి పొందండి! అది ఎంత ఆనందంగా ఉంటుందో మీరు గుర్తిస్తే చాలు.!

మా నాన్నను ఓ టీచర్ అడిగారు "మీ పిల్లల కోసం మీరేం చేస్తున్నారు?" అని. "అదేం ప్రశ్న? మా పిల్లల కోసం మేము ఏమి చేయడం లేదు?. మాకు వాళ్ళ కంటే కావాల్సింది ఏముంది? తిండికి లోటు లేదు. మంచి బట్టలు కొంటాము. మంచి బడికి పంపిస్తూ చదివిస్తున్నాము. ఆటలాడిస్తున్నాము. వాళ్ళ భవిష్యత్తు కోసం డబ్బు కూడ బెడుతున్నాము. ఇంతకన్నా ఎక్కువ ఏం చేయాలి?" అని మా నాన్న మాట్లాడాడు.

ఆలోచించండి. ఇంతేనంటారా? ఇంకేం చేయలేరా?. న్యూస్ పేపర్ కాసేపు పక్కన పెట్టి పిల్లల ముద్దు ముద్దు మాటలు వినలేరా? టీవీ సీరియల్ కాసేపు మానేసి పిల్లలతో కూర్చోలేరా? స్నేహితులతో కబుర్లాడే బదులు పిల్లలతో బజారుకో, బ్యాంకుకో మ్యూజియంకో తిప్పొచ్చు కదా. రాత్రిపూట వేరే పనులు మాని పిల్లలకు కథలు, కబుర్లు చెప్పి హాయిగా నిద్రపుచ్చితే ఎంత బాగుంటుంది కదా! మాకు మీరు ఇచ్చే ఆస్తి కంటే మీరు మాతో గడపడమే మాకు చాలా ఇష్టం.

తల్లిదండ్రుల ప్రేమ తక్కువైన పిల్లలు లోకాన్ని ద్వేషించే వాళ్ళుగా మారతారు. సంఘ వ్యతిరేకులుగా, ప్రతి దాంట్లో తప్పులు వెతికేవారుగా తయారవుతారు. తల్లితండ్రుల ప్రేమను అతిగా పొందిన పిల్లలు ఎప్పుడూ అమ్మను అంటిపెట్టుకొని ఉండే వ్యక్తులుగా మారుతారు. పిరికివాళ్ళగా, చేతకాని వాళ్లుగా తయారవుతారు. కాబట్టి మాకు ఎంత ప్రేమ ఇవ్వాలో మీరే, మీ పెద్దలే తెలుసుకోండి..

అవును మేము పిల్లలం మాకు ప్రేమ కావాలి.. మాకు స్వేచ్ఛ కావాలి. స్వేచ్ఛగా చదువుకునే వాతావరణం కావాలి. ఉదయం 8 గంటల నుండి సాయంత్రం 8 గంటల వరకు చదివించే జైలు అక్కరలేదు. స్వేచ్ఛగా ఆడుకునే ఆవరణం కావాలి. ఆట స్థలమే లేని పాఠశాల అక్కరలేదు. స్వేచ్ఛగా పీల్చుకునే గాలి కావాలి. చెట్టుచేమ నిండుగా ఉండే పాఠశాల కావాలి. స్వేచ్ఛగా ఆలోచించుకునే వాతావరణం కావాలి. నిజమైన గురువులు కావాలి. స్వేచ్ఛగా ఎదిగే సమాజం కావాలి.

మేము ద్వేషంతో చూసే వాతావరణంలో పెరిగితే పోట్లాడడం అలవాటు చేసుకుంటాము. గుర్తింపు పొందే వాతావరణంలో పెరిగితే మంచి లక్ష్యాన్ని ఏర్పరచుకుంటాము. మేము భయంతో పెరిగితే అభద్రతకు లోనవుతాము. విశ్వాసం గల స్థితిలో జీవిస్తే వివేచన నేర్చుకుంటాము. మేము గేళిచేయబడుతూ పెరిగితే సిగ్గుతో కుంచించుకు పోతాము. స్నేహపూరిత వాతావరణంలో పెరిగితే, మేము నివసించే ప్రపంచం గొప్పదనుకుంటాము. అయ్యో పాపం అనే స్థితిలో పెరిగితే మాపై మేము జాలి పడుతూ ఉంటాము. ప్రేమాభిమానాల మధ్య పెరిగితే పరిపూర్ణ వ్యక్తులుగా ఎదుగుతాము. అలాంటి వాతావరణం కల్పించాల్సిన బాధ్యత పెద్దలుగా మీదే కదా!

మేము అబద్ధాలు చెబుతూ ఉన్నామంటే, మీరంటే మేము భయపడుతున్నాం అన్నమాట. లేకుంటే మిమ్మల్ని అనుకరిస్తున్నామన్న మాట. అబద్ధాలు చెప్పే తల్లిదండ్రులకు అబద్దాలు చెప్పే పిల్లలే ఉంటారు. మమ్మల్ని మేము రక్షించుకోవడానికి అబద్ధాలు చెప్తాము. మీరు మాకు ఇంట్లో భయాన్ని రద్దు చేయండి. స్వేచ్ఛనివ్వండి.. వాటంతట అవే మాలో అబద్ధాలు తగ్గిపోతాయి.

మీ పెద్దలు, మమ్మల్ని అదరగొడుతూ, బెదరగొడుతూ ఉంటారు. మా మనసులో విషయాలు తెలుసుకోకుండా మమ్మల్ని విమర్శించి చిన్నబుచ్చుతూ ఉంటారు. మా పట్ల సానుభూతి చూపకపోగా, మీకు మాకు మధ్య అపార్థాలు కల్పిస్తారు. దూరం పెంచుతారు. మీరు కొంచెం తీరిక చేసుకుని మా ఆనందంలో పాలుపంచుకోండి. మా పట్ల సానుభూతి చూపిస్తే మా హృదయం ఆనందపడుతుంది, మీకు దగ్గరవుతాం. మరింత ఆత్మీయంగా తయారవుతాం.

మీ పెద్దవాళ్ళ కళ్ళు అమృతంతో నిండి ఉందో, లేక విషాన్ని కురిపిస్తున్నాయో... మీ మాటలు తేనెలు ఒలుకుతున్నాయోలేక సూది పోటులో... మీ చేతులు మెత్తగా నిమురుతున్నాయో లేక కర్కశంగా పట్టుకున్నాయో.... మీ మనసులో ఇష్టమే ఉందోలేక అయిష్టమే ఉందో.... మాకు ఇట్టే తెలిసిపోతుంది. అవును మాకు అంతా తెలుసు. మా పనులు మమ్మల్ని చేసుకోనివ్వండి. మా రుమాలు మేమే ఉతుక్కోనివ్వండి. గ్లాసులో నీళు పోసుకోనివ్వండి. పూలనుసర్దనివ్వండి. పళ్లెం కడగనివ్వండి. గింజలు చిందనివ్వండి. అన్నం వడ్డించనివ్వండి. మా పద్ధతిలో మమ్మల్ని చేయనివ్వండి. మేము కోరుకున్నట్లు చేయనివ్వండి. అప్పుడే మాకు మేముగా ఎదిగేందుకు అవకాశం దొరుకుతుంది కదా! చదువు మీద ఇష్టం పెంచాల్సిన ఉపాధ్యాయులలో కొంతమంది మమ్మల్ని మానసికంగా కంగదీసి చదువు మీద విరక్తి, భయం కల్పిస్తున్నారు. పరీక్షల చివరి వరకు బట్టీ పట్టి, గుర్తున్నది రాసి, పరీక్ష తర్వాత మర్చిపోవడం జరుగుతుంది. మళ్లీ వాటిల్లో మార్కులు సరిగా రాకపోతే ఉపాధ్యాయులు, ఇంట్లో తల్లిదండ్రులు కొట్టడం, మమ్మల్ని ప్రాణం లేని యంత్రాలుగా భావిస్తున్నారు. మాకు పని పెట్టకుండా, కేవలం వినడం ద్వారా మాత్రమే నేర్పించే ప్రయత్నం వల్ల మాలో సృజనాత్మకత లోపిస్తోంది. ఆటలు, పాటలు, లలిత కళలు, చదువు ఒక దేశానికి, ఒక జాతికి, ఒక వ్యక్తి జీవితానికి సంబంధించిన అంశంగా కాక అది మార్కెట్లో సరుకుగా మారిపోతుంది. మాకు చదువు తప్ప మరి ఏమీ నేర్పించడం లేదు. మమ్మల్ని విషయాన్ని గుర్తుపెట్టుకునే రోబోలుగా చూస్తున్నారు.

అందుకే "ఖలీల్ జిబ్రాన్" అనే రచయిత మా గురించి ఇలా అంటారు." మీ పిల్లలు మీ సొంతం అనుకునేరు. వాళ్ళొక నిరంతర జీవన ప్రవంతికి బిడ్డలు. మీ ద్వారా వాళ్ళకి జన్మ లభించినంత మాత్రాన వాళ్లు మీ నుండే పుట్టినట్లు కాదు. వాళ్లు మీతో ఉన్నంత మాత్రాన వాళ్లు మీ వాళ్ళైనట్టు కాదు. మీరు వాళ్ళకి ప్రేమను పంచివ్వండి. అంతేగాని మీ ఆలోచనల్ని రుద్దకండి.వాళ్ళకి వాళ్ల స్వంత ఆలోచనలు ఉంటాయని మరవకండి.వారి శరీరాలనే మీరు పోషించేది ఆత్మలను కాదని మరవకండి. వాళ్ళ ఆత్మలు రేపటి ప్రపంచం కోసం తపిస్తూ ఉంటాయి. ఆ ప్రపంచాన్ని మీరు చూడలేరు కలనైనా కనలేరు.వాళ్ళలా మీరు ఉండే ప్రయత్నం చేయండి వాళ్లను మీలా మార్చేందుకు మాత్రం పూనుకోకండి. జీవితం వెనక్కి నడవదని గుర్తించండి మీరు విల్లు అయితే మీ పిల్లలు అందులోనుండి దూసుకెళ్లే బాణాలు సుమండీ.!" మేము బాలలం. అమ్మాయిలు, అబ్బాయిలు స్నేహంగా న్యాయబద్ధంగా ఆలోచిస్తాం. కుల మతాల కల్మషానికి దూరంగా ఉంటాం. మమ్మల్ని అలా ఉండనిస్తే చాలు. అందుకే మాకు స్వేచ్ఛ కావాలి. నిజమైన స్వేచ్ఛ కావాలి. మేము పిల్లలం. రేపు పెద్దలం. రేపటి సమాజాన్ని రూపు దిద్దుతాం. భూగోళం మీద ఉన్న ఏ దేశం పిల్లలు అయినా... ఏ భాషలు మాట్లాడినా.. ఏ వేషం వేసుకున్నా... అందరం అందరినీ... ప్రేమిస్తాం.. ప్రేమిస్తాం.

యం.ఎస్. యుగంధర్ బాబు, రాష్ట్ర ఉపాధ్యక్షులు, జన విజ్ఞాన వేదిక (బిజినెస్ న్యూస్)

అంచెలంచెలుగా... సూర్య ఎలివేటర్స్ ..



ARUN KOVURU
Managing Director
ASCENT LIFTS & ESCALATORS Pvt. Ltd.
AN ISO 9001-2015 CERTIFIED COMPANY

ప్రజాశక్తి-తిరుపతి సిటి

మీ అపార్ట్‌మెంట్లో లిఫ్ట్ పనిచేయడం లేదా.. మీ ఆఫీసులో లిఫ్ట్ మరమ్మతులకు గురైందా... అయితే నాణ్యత ప్రమాణాల్లో ఎదురులేనిదిగా ఉన్న సూర్య ఎలివేటర్స్‌ను సంప్రదించాల్సిందే. స్థానిక లీలామహల్ రోడ్డులోని సూర్య లిఫ్ట్స్ అధినేత మేనేజింగ్ డైరెక్టర్ అరుణ్ ప్రజాశక్తితో మాట్లాడుతూ దాదాపు 22 సంవత్సరాలుగా ప్రముఖ పట్టణాలు బెంగళూరు, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి నగరాలలో కమిర్షియల్, షాపింగ్ కాంప్లెక్స్ హైసెన్, ఆఫీసులకు లిఫ్ట్‌లను అందిస్తున్నామన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో నాణ్యతకు పెట్టింది పేరుగా టిటిడి వంటి ధార్మిక సంస్థలో భక్తుల అవసరాలకు, అధికారుల సూచనల మేరకు నిరంతరం కొత్త ఉత్పత్తులతో లిఫ్ట్‌లను తయారు చేస్తున్నామన్నారు. సూర్య ఎలివేటర్స్ ప్రైవేటు లిమిటెడ్, లీడర్స్ ఇన్ ఎలివేటర్స్ సిస్టమ్స్ ద్వారా మన్నికైన లిఫ్టులను అందిస్తున్నట్లు తెలిపారు. లిఫ్టులు, ఎస్కలేటర్ల ఉత్పత్తి రంగంలో అగ్రగణ్యులైన మాంటెఫెర్రో -మోరిన్, సంస్థ ఉత్పాదనలు ప్రస్తుతం అందుబాటులోకి రావడం వినియోగదారులందరికీ అనందదాయకంగా ఉందన్నారు. అత్యంత భద్రతా ప్రమాణాలు, సౌకర్యం, అందం ఆకర్షణలతో లిఫ్టులను విక్రయిస్తున్నామని తెలిపారు. ఇంటికైనా, అపార్ట్‌మెంటుకైనా, కార్మాగారం, కార్యాలయానికైనా పిల్లలు సైతం అత్యంత నమ్మకంగా వాడదగిన మన్నిక, దృఢత్వం, నాణ్యత కలిగిన ఉత్పాదనలు సూర్య ఎలివేటర్స్‌కే సొంతమన్నారు. లిఫ్ట్ సంబంధిత సమస్యలకు, లిఫ్ట్ సౌకర్యాల కొరకు సూర్య ఎలివేటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఫోన్ నంబర్లు 08772258299, 9959875577 సంప్రదించాలని కోరారు.



ఎంఈవోకు యూటీఎఫ్ సన్మానం

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

తిరుపతి అర్బన్ ఎంఈఓ 2 గా ఇటీవల నియమితులైన భాస్కర్ నాయక్ ని శుక్రవారం తిరుపతి అర్బన్ యూటీఎఫ్ కమిటీ మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించింది. ఎంఈఓ మాట్లాడుతూ విద్యాభివద్ధి కి ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు సహాయ సహకారాలు అందించాలని కోరుతూ అందరూ కలిసి సమిష్టిగా కషిచేసి విద్యాభివద్ధికి కషి చేయాలని తెలియజేశారు. అలాగే ప్రాథమిక విద్యలో రీడింగ్ రైటింగ్ నైపుణ్యాలు విద్యార్థులలో. పెంపొందించడానికి ఉపాధ్యాయులు మరింత కషి చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తిరుపతి అర్బన్ యుటిఎఫ్ శాఖ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పి. కవిత, ఎస్ ఖాదర్బాషా, నెహ్రూ మున్సిపల్ హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి మునిశేఖర్ , దొడ్డపురం మునిసిపల్ ప్రధానోపాధ్యాయులు జి . రెడ్డప్ప రెడ్డి, జిల్లా కార్యదర్శి బండి మధుసూదన్ రెడ్డి, ట్రెజరర్ వి ప్రభు కుమార్ శెట్టి, నాయకులు నేలపల్లి మోహన్, సోమచంద్రారెడ్డి, చంద్రశేఖర్, ఢిల్లీ ప్రసాద్, పి విజయ కుమారి, చందూ, ఎం ప్రసన్నలక్ష్మి, సుధా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ ఒలంపిక్స్ దినోత్సవం

ప్రజాశక్తి - కార్వేటినగరం

ప్రభుత్వ డిగ్రీకళాశాలలో అంతర్జాతీయ ఒలంపిక్స్ దినోత్సవం వేడుకలను వ్యాయామ విద్య విభాగం ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వ్యాయామ ఉపాధ్యాయుడు జోగి ప్రసాద్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 23వ తేదీన అంతర్జాతీయ ఒలంపిక్స్ వేడుకలను కళాశాలలో జరుపుకోవడం ఆనవాయితీ అన్నారు. అలాగే ఒలంపిక్స్ గొప్పదనాన్ని విద్యార్థులకు వివరించారు. అనంతరం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలసుబ్రమణ్య ఆచారి మాట్లాడుతూ వివిధ ఖండాల క్రీడాకారుల మధ్య మంచి స్నేహపూరిత వాతావరణం నెలకొల్పడం కోసం ఈ ఒలంపిక్స్ క్రీడలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా కారులు దీనిని స్ఫూర్తిగా తీసుకుని ఇతర క్రీడా కారులతో స్నేహ పూరితంగా మెలగాలని తెలియజేశారు.


18 ఆలయాలు మంజూరు :జడ్పిటిసి

ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం

ఎస్ఆర్ పురం మండలానికి టిటిడి ద్వారా 18 నూతన ఆలయాలు మంజూరు అయ్యాయని జెడ్పిటిసి ప్రసాద్ రెడ్డి తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...చొక్కామడుగు దిగువ ముద్ధి కుప్పం, సి.కె.పురం దాసరిగుంట పుల్లూరు ఎన్ ఆర్ పురం, చిన్నతయురు పెద్ద తయ్యూరు ఒడ్డుపల్లి పిల్లిగుండ్లపల్లి డీకే మర్రిపల్లి వెంకటాపురం రాఘవరాజపురం మిట్ట హరిజనవాడ పొదలపల్లి క్షీరా సముద్రం, దిగువ ముంగుంట ఏయంపురం వడ్డిండ్లు ఈ గ్రామాలకు ఒక్కొక్క ఆలయానికి 10 లక్షలు మంజూరు అయిందని తెలిపారు. గ్రామస్తులు అందరు కలిసి ఆలయ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని, సకాలంలో బిల్లులు అందుతాయని ఈ అవకాశాన్ని గ్రామ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జడ్పిటిసి ప్రసాద్ రెడ్డి తెలిపారు, అలాగే దాసరి గుంట, క్షీరా సముద్రం, దిగుమంగుంట, పెద్ద తయ్యూరు గ్రామాల్లో నాలుగు ఆలయాలు పనులు జరుగుతున్నాయని తెలిపారు . ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మణి, నాయకులు భూపతి రెడ్డి, యుగంధర్ రెడ్డి, ఆనంద్, రామచంద్ర యాదవ్ పాల్గొన్నారు

ప్రజాశక్తి

శనివారం 24 జూన్ 2023 8 + 4 పేజీలు



తిరుపతి



చిత్తూరు



అన్నదాన పథకానికి లక్ష విరాళం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

శ్రీకాళహస్తీశ్వరాలయ నిత్యాన్నదాన పథకానికి నెల్లూరుకు చెందిన బండి వేణుగోపాల్ కుటుంబం శుక్రవారం రూ. లక్ష విరాళంగా అందజేశారు. ఆ మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ పాలకమండలి చైర్మన్ అంజూరు శ్రీనివాసులకు అందజేసి అన్నదాన పథకానికి ఖర్చు చేయాల్సిందిగా సూచించారు. అనంతరం దాతకు ఆలయ మర్యాదలతో స్వామి అమ్మవార్ల దర్శనం చేయించారు.

'జనసేన' నాయకులపై పోలీసు కేసు

తిరుపతి (మంగళం) : అనుమతి లేకుండా నిరసన ప్రదర్శన నిర్వహించారంటూ జనసేన నాయకులపై పోలీసులు కేసు నమోదు చేశారు. టివిఎస్ షోరూం సర్కిల్‌లో 'ఎపికి వైసిపి బాయ్‌బాయ్' అనే నిరసన కార్యక్రమాన్ని శుక్రవారం సాయంత్రం చేపట్టారు. అనుమతి లేకుండా కార్యక్రమాన్ని ఎలా నిర్వహిస్తారంటూ స్టేషన్‌లో మూడు గంటలసేపు నిర్బంధించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. పోలీసుల తీరుపై జనసేన నాయకులు రాజారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

స్విమ్స్ భోజనశాలలో జేఈవో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - తిరుపతి అర్బన్

స్విమ్స్‌లో వైద్య విద్య, పారా మెడికల్ కోర్సులు చదువుతున్న విద్యార్థులకు అందిస్తున్న ఉచిత భోజనం నాణ్యతను జేఈవో సదా భార్గవి శుక్రవారం ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులకు ఆమె స్వయంగా భోజనం వడ్డించి రుచి, నాణ్యత గురించి అడిగి తెలుసుకున్నారు. వారితో కలిసి భోజనం చేశారు. వంటశాల, భోజన శాల ను శుభ్రంగా ఉంచుకోవాలని సిబ్బంది, విద్యార్థులకు సూచించారు. డిప్యూటీ ఈవో గోవింద రాజన్, క్యాటరింగ్ విభాగం ప్రత్యేకాధికారి శాస్త్రి తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

'రాజకీయ లబ్ధి కోసమే అసత్య ఆరోపణలు'


తిరుపతి సిటీ : రాజకీయంగా లబ్ధి పొందాలని, ఎమ్మెల్యే సీటు దక్కకుండా పోతుందని బొజ్జల సుధీర్ రెడ్డి అసత్య ఆరోపణలు చేస్తున్నాడని పేరూరు మునిరెడ్డి తెలిపారు. విలేకరుల సమావేశంలో పేరూరు మునిరెడ్డి మాట్లాడుతూ 338, 345, 335, 385 వెయ్యి కోట్లు స్కాం జరిగిందని తనపై అసత్యాలు ఆరోపించారన్నారు. వెబ్ ల్యాండ్, ఆన్లైన్ అడంగల్ లో ఇంతకు ముందు ఉన్న తహసీల్దార్ లు ఎవ్వరు మార్పు చేయలేదని తెలిపారు. కోర్టులో ఉన్న దాని గురించి మాట్లాడటం సమంజసం కాదన్నారు. తనపై రూ. 1000 కోట్లు స్కాం అని అవాస్తవ ఆరోపణలు చేసిన సుధీర్ రెడ్డి పై పరువు నష్టం దావా వేయబోతున్నానని తెలిపారు.

బాలుడిని పరామర్శించిన సుగుణమ్మ

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

తిరుమల కాలినడకమార్గంలో చిరుతదాడిలో గాయపడిన బాలుడు కౌశిక్‌ను తిరుపతిమాజీ ఎంఎల్‌ఏ సుగుణమ్మ శుక్రవారం పరామర్శించారు. వారి కుటుంబానికి ఆర్థిక సాయం చేశారు. సుగుణమ్మ మీడియాతో మాట్లాడుతూ కాలినడక మార్గంలో నిన్న జరిగిన తిరుమల జరిగిన సంఘటనకౌశిక్ అనే బాలుడిని చిరుత పులి నోట కరుచుకొని దాదాపు 200 మీటర్లు లాక్కుని వెళ్లడం దారుణమన్నారు. ఈ ఘటనతో భక్తులు భయకంపితులవు తున్నారన్నారు. కాలిబాటన వెళ్లే భక్తులకు రక్షణ కల్పించాలని కోరారు. ఈకార్యక్రమంలో టిడిపి కార్పోరేటర్ ఆర్‌సి మునికృష్ణ, నాయకులు మునిశేఖర్‌రాయల్ పాల్గొన్నారు.

రేపు 'మెగా ఉచిత వైద్యశిబిరం'



మెడికల్ క్యాంపును జయప్రదం చేయాలని కరపత్రం విడుదల

ప్రజాశక్తి - తిరుపతి (మంగళం)

'ప్రజాశక్తి' దినపత్రిక, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో అన్నమయ్య జానపద కళాక్షేత్రంలో మెగా ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు 'ప్రజాశక్తి' మేనేజర్ సిఎస్‌ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆదివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం వరకూ జరిగే ఈ శిబిరాన్ని మంగళం, బిటిఆర్‌కాలనీ, సప్తగిరినగర్ వాసులు వినియోగించుకోవాలని కోరారు. 25 మంది నిష్ణాతులైన డాక్టర్లు వివిధ వ్యాధులకు పరీక్షలతో పాటు చికిత్స చేస్తారని తెలిపారు. ఉచితంగా మందులు అందిస్తారని పేర్కొన్నారు. శుక్రవారం ఈ మేరకు 'కరపత్రాన్ని' ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి బ్యూరో ఇన్‌ఛార్జి వళిగళం గోపి, జిల్లా ఇన్‌ఛార్జి పి.శ్రీనివాసులు, జాబ్‌వర్కు ఇన్‌ఛార్జి గుణశేఖర్, సర్క్యులేషన్ జిల్లా ఇన్‌ఛార్జి సురేష్, మిషన్ సెక్షన్ ఇన్‌ఛార్జి వెంకటేష్, అకౌంటెంట్ ప్రభాకర్ పాల్గొన్నారు.

'శ్రీవాణి' నిధులపై టిటిడి శ్వేతపత్రం



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

శ్రీ వేంకటేశ్వర ఆలయ నిర్మాణ ట్రస్టు(శ్రీవాణి) నిధులపై టీటీడీ ధర్మకర్తల మండలి అధ్యక్షులు వైవి.సుబ్బారెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డితో కలిసి శ్వేతపత్రం విడుదల చేశారు. తిరుమల అన్నమయ్య భవనంలో శుక్రవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మాట్లాడుతూ టీటీడీ బోర్డు తీర్మానం నం.388 ప్రకారం సనాతన హిందూ ధర్మ ప్రచారంలో భాగంగా పురాతన దేవాలయాల పునరుద్ధరణ, కొత్త ఆలయాలు, చిన్న ఆలయాల(భజనమందిరాలు) నిర్మాణానికి తోడ్పాటును అందించే ప్రధాన లక్ష్యంతో 2018, ఆగస్టు 28న శ్రీవాణి ట్రస్టు ఏర్పాటైందన్నారు. అదేవిధంగా 2019 సెప్టెంబర్ 23న బోర్డు తీర్మానం 23 ప్రకారం శ్రీవాణికి రూ.10వేలు విరాళం ఇచ్చిన దాతలకు ఒకసారి విఐపి బ్రేక్ దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. అప్పటినుండి ట్రస్టు వాస్తవ కార్యాచరణ ప్రారంభమైంది. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మత్స్యకార కాలనీల్లో ఆలయాల నిర్మాణానికి గాను టీటీడీ చేపట్టిన ఈ మహత్తర కార్యక్రమానికి నిధులు వెల్లువెత్తాయి. ఈ ఏడాది మే 31వ తేదీ వరకు, ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో భక్తులు శ్రీవారికి రూ.860 కోట్లకు పైగా విరాళాలు అందించారు. శ్రీవాణి ట్రస్టు ద్వారా 8.25 లక్షల మంది భక్తులు శ్రీవేంకటేశ్వరస్వామివారిని దర్శించుకున్నారు. 176 పురాతన ఆలయాల పునరుద్ధరణకు రూ.93 కోట్లు మంజూరు చేశామని తెలిపారు. వెనుకబడిన ప్రాంతాల్లో ఒక్కొక్కటి రూ.10 లక్షల వ్యయంతో మొత్తం 2,273 ఆలయాల నిర్మాణానికి ఆమోదం తెలిపామని, వీటిలో 1953 ఆలయాలను ఎపి దేవాదాయ శాఖ, 320 ఆలయాలను సమరసత సేవ ఫౌండేషన్ నిర్మిస్తాయని వివరించారు. టీటీడీ పరిపాలన పూర్తి పారదర్శకంగా నడుస్తోందని, ఇందులో భాగంగా ఇప్పటికే టీటీడీ ఆస్తులు, ఫిక్స్‌డ్ డిపాజిట్లు, బంగారం డిపాజిట్లపై శ్వేతపత్రం విడుదల చేశామని ఛైర్మన్ చెప్పారు. శ్రీవాణి నిధుల వినియోగంపై సందేహాలను నివత్తి చేసేందుకు తాము సిద్ధంగా ఉన్నామని, నిధులు దుర్వినియోగం అవుతున్నాయని కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం చేస్తున్న నిరాధార ఆరోపణలను నమ్మవద్దని భక్తులకు విజ్ఞప్తి చేశారు. ఈ నిధులను పురాతన ఆలయాల పునరుద్ధరణ, నూతన ఆలయాల నిర్మాణాలకు వినియోగిస్తున్నామని పునరుద్ఘాటించారు.

ఈవో ఎవి.ధర్మారెడ్డి మీడియాతో మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్టు నిధుల వ్యవహారంపై కొందరు పీఠాధిపతులు, వీహెచ్‌పీ నేతలు తనను కలిసినప్పుడు అన్ని పత్రాలు, బ్యాంకు ఖాతాలు, బ్యాలెన్స్ మొత్తం వివరాలు చూపానన్నారు. ఈ వివరాలపై విశ్వహిందూ పరిషత్ సెంట్రల్ గవర్నింగ్ కౌన్సిల్ సభ్యులు రాఘవులు పూర్తి సంతప్తి వ్యక్తం చేశారని చెప్పారు. ఎవరైనా నిరాధార ఆరోపణలు చేసే ముందు లక్షలాది మంది భక్తుల మనోభావాలు దష్టిలో ఉంచుకోవాలని, ఇలాంటి వారిపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

అందరికోసం 'జగనన్న సురక్ష' : జేసీ



ప్రజాశక్తి-తిరుపతి టౌన్

అర్హత ఉండి ప్రభుత్వ పథకాలు, పౌర సేవలు అందక పొరపాటున మిగిలిన వారికి తలుపు తట్టి పథకాలు అందించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించారని, జిల్లాలో ఈ నెల 24 నుండి పకడ్బందీగా అమలు చేయాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డి కే బాలాజీ అధికారులకు సూచించారు. శుక్రవారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి వర్చువల్ విధానంలో అన్ని జిల్లాల కల్లెక్టర్ల తో, ప్రజా ప్రతినిధులతో సమావేశమై జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వివరించి , ప్రారంభించగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నుండి సత్యవేడు శాసన సభ్యులు ఆదిమూలం, జె.సి, డి. ఆర్. ఓ. కోదండరామి రెడ్డి, ఆర్డిఓ లు కనకనర్సారెడ్డి, రామారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు. అనంతరం జాయింట్ కలెక్టర్ అధికారులతో సమావేశమై మండల స్థాయి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఇంటివద్దకే ప్రభుత్వసేవలు అందించే కార్యక్రమంలో భాగంగా ఈనెల 24 నుండి కొన్ని మండలాలలో సచివాలయాలను ఎంపిక చేయడం జరిగిందని, ఆ సచివాలయ పరిధిలోని వాలంటీర్లు తమ పరిధిలోని ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ కార్యక్రమాలపై, పథకాలపై, పౌరసేవలపై అవగాహన కల్పించి ఏదైనా పథకానికి అర్హత కలిగి ఉంటే వారి వద్ద నుండి తప్పనిసరి అవసరమైన ధ్రువపత్రాలను పొందాలని అన్నారు. అలాగే అవసరమైన పౌరసేవలను అందించడానికి సంబంధిత సచివాలయంలో ఎప్పటికప్పుడు టోకెన్ జనరేట్ చేయాల్సి ఉంటుందని ఆ టోకెన్ మేరకు లబ్ధిదారులకు జూలై 1 నుండి జరిగే జగనన్న సురక్ష సమావేశాలలో సమయం సూచించి అర్హతగల పత్రాలను అందించాల్సి ఉంటుందని అన్నారు. స్పందన కార్యక్రమంలో గానీ, జగనన్నకు చెబుదాం కార్యక్రమంలోగాని వినతులు అందించి ఉంటే పరిష్కరించిన వాటిని వివరించడం, పరిష్కరించలేని వాటిని ఎందుకు పరిష్కరించలేక పోయామో మీ సచివాలయ పరిధిలో వుంటే స్నేహపూర్వకంగా అర్థమయ్యేలా లబ్దిదారులకు వివరించాలని సూచించారు. ఈ సమీక్షలో డి ఎల్ డి ఓ సుశీలా దేవి పాల్గొన్నారు.

దళితుల భూముల్లో ఆక్రమణలు తొలగించండి

బిఎన్ కండ్రిగ : మండలంలోని కుక్కం బాకం రెవెన్యూలోని దళితుల భూములను దౌర్జన్యంగా కబ్జా చేస్తున్న అగ్రకుల పెత్తందారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు వందవాసి నాగరాజు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు దాసరి జనార్ధన్ డిమాండ్ చేశారు. కుక్కం భాగం గ్రామం రెవెన్యూలోని సర్వే నంబర్ 301/8బి లో బోర్ర వేణు అనే దళిత విలేకరికి వారి తల్లి నుంచి సంక్రమించిన డికెటి పట్టా భూమిని సూళ్లూరు పేట పట్టణానికి చెందిన వేణుగోపాల్ శెట్టి దౌర్జన్యంగా స్థానిక అగ్రకులాల నాయకులను తీసుకెళ్లి ఆక్రమించడం అన్యాయమని, దౌర్జన్యకారులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల తాసిల్దారు హనుమాన్ నాయక్ కు, పోలీస్ స్టేషన్ ఎస్ఐకి విజ్ఞప్తి చేశారు. మండలంలో సూళ్లూరుపేట, నాయుడుపేట, తిరుపతి తదితర స్థానికేతరులు వందల ఎకరాల భూమిని అక్రమంగా పట్టాలు చేసుకుంటున్నారని, ఆక్రమణలను తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణయ్య, బాలగురవయ్య, సుబ్బయ్య, తిరుపాలు, చిన్న గురవయ్య పాల్గొన్నారు.




విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభం



తిరుపతి టౌన్ : రూ.18.20 కోట్లతో నాలుగు 33 కెవి విద్యుత్ సబ్‌స్టేషన్లను ఎంఎల్‌ఎ భూమన కరుణాకర్‌రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. చింతలచేను, రవీంద్రనగర్, ఉపాధ్యాయనగర్, మున్సిపల్ ప్రకాశం పార్కు, ఎంఆర్‌పల్లి మారుతీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ వినియోగదారులకు ఈ సబ్‌స్టేషన్లు సేవలందించనున్నాయి. నగర మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ ముద్రనారాయణ పాల్గొన్నారు. విద్యుత్ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులూ ఇక ఉండబోవని ఎంఎల్‌ఎ తెలిపారు. తిరుపతిలో నిరంతరం విద్యుత్ సరఫరా అవుతుందని చెప్పారు.

ప్రజాశక్తి
శనివారం 24 జూన్ 2023 8 + 4 పేజీలు



తిరుపతి



చిత్తూరు

నడక మార్గాల్లో 'కంచె' ఏర్పాటు

బాలుడిని పరామర్శించిన టిటిడి ఛైర్మన్, ఈవో



ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

అలిపిరి నడక మార్గంలో చిరుత దాడి నుండి బాలుడు కౌశిక్ క్షేమంగా బయట పడ్డాడని టీటీడీ ఛైర్మన్ వైవి సుబ్బారెడ్డి, ఈవో ఎవి ధర్మారెడ్డి అన్నారు. భక్తులను వన్యప్రాణుల నుంచి కాపాడేందుకు శ్రీవారిమెట్టు, అలిపిరి నడకమార్గాల్లో రెండు వైపులా కంచె ఏర్పాటు చేసి, భక్తులను బృందాలుగా పంపనున్నట్లు చెప్పారు. తిరుపతి శ్రీ పద్మావతి చిన్నపిల్లల హృదయాలయం ఐసియులో చికిత్స పొందుతున్న బాలుడిని శుక్రవారం ఛైర్మన్, ఈవో పరామర్శించారు. ఈ సందర్భంగా ఛైర్మన్ మీడియాతో మాట్లాడుతూ కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన భక్తులు గురువారం రాత్రి అలిపిరి నడకమార్గంలో శ్రీవారి దర్శనార్థం తాతతో కలిసి నడచి వెళుతుండగా చిరుత మూడేళ్ల కౌశిక్‌ను గాయపరచి తీసుకెళ్లిందన్నారు. బాలునికి ఎలాంటి ప్రమాదం లేదని, క్షేమంగా ఉన్నాడని, మరింత మెరుగైన వైద్యం అందిస్తామని చెప్పారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శ్రీవారిమెట్టు, అలిపిరి నడకమార్గాల్లో వన్యప్రాణులకు ఇబ్బంది లేకుండా రెండు వైపులా ఫెన్సింగ్ ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. రాత్రిపూట రెండు మార్గాల్లోనూ భక్తులను నిలిపి వేసేందుకు అధికారులు చర్యలు తీసుకుంటారని వివరించారు.

చిరుత దాడి ప్రదేశాన్ని పరిశీలించిన టీటీడీ ఈవో

అలిపిరి కాలినడక మార్గంలో ఏడో మైలు వద్ద బాలుడిపై చిరుత దాడి చేసిన ప్రదేశాన్ని టీటీడీ ఈఓ ఏవి.ధర్మారెడ్డి శుక్రవారం మరోమారు పరిశీలించారు. ఈవో మీడియాతో మాట్లాడుతూ దాడి చేసిందని పిల్లచిరుత కావడంతో బాలుడికి ప్రాణాపాయం తప్పిందన్నారు. దాడి జరిగిన సమయంలో భక్తులు పెద్దగా అరవడం, రిపీటర్ స్టేషన్ నుంచి లైట్లు వేయడంతో చిరుత బాలుడిని వదిలి వెళ్లిపోయిందన్నారు. టీటీడీ అటవీ శాఖ అధికారులు చిరుత సంచారాన్ని గుర్తించారని, అలిపిరి గాలిగోపురం నుంచి నరసింహస్వామి గుడి వరకు చిరుత సంచరిస్తున్నట్టుగా తెలుస్తోందని చెప్పారు. ఈ కారణంగా రాత్రి 7 గంటల తరువాత అలిపిరి నడక మార్గంలో గాలిగోపురం నుండి 200 మంది భక్తులను ఒక బందంగా కలిపి పంపేలా ఏర్పాట్లు చేశామన్నారు. వీరితోపాటు సెక్యూరిటీ గార్డ్ ఉంటారని, భక్తులు గోవింద నామస్మరణ చేసుకుంటూ ముందుకు సాగుతారని చెప్పారు. చిన్నపిల్లలను బందం మధ్యలో ఉంచుకుని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. చిరుతను పట్టుకునేందుకు ఏర్పాట్లు చేశామని, ఇందుకోసం కెమెరా ట్రాప్స్ కూడా సిద్ధం చేశారని ఈవో చెప్పారు. శ్రీవారి మెట్టు మార్గంలో సాయంత్రం 6 గంటల వరకు, అలిపిరి మార్గంలో రాత్రి 10 గంటల వరకు భక్తులను అనుమతిస్తారని తెలిపారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఘాట్ రోడ్లలో వెళ్లే ద్విచక్ర వాహనదారుల భద్రతకు ఎలాంటి చర్యలు తీసుకోవాలనే విషయంపై ఆలోచిస్తున్నట్టు చెప్పారు. టీటీడీ సివిఎస్వో నరసింహ కిషోర్, సిసిఎఫ్ నాగేశ్వరరావు, డీఎఫ్ఓ సతీష్, టీటీడీ డిఎఫ్ఓ శ్రీనివాస్, విజివో బాలిరెడ్డి పాల్గొన్నారు.



ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ట : టిడిపి

కుటుంబానికి రూ.50 లక్షలివ్వాలి

ప్రజాశక్తి - యాదమరి



బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తూ

యాదమరి మండలం తెల్లరాళ్లపల్లి పాఠశాలలో గుంతలో పడి మృతిచెందిన ఇద్దరు చిన్నారులకు పూతలపట్టు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మురళీమోహన్ శుక్రవారం నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇవి ప్రభుత్వ హత్యలని, ప్రభుత్వ నిర్లక్ష్యానికి పరాకాష్ఠగా పసిబిడ్డలు బలయ్యారన్నారు. తాను విద్యార్థుల మేనమామ అని ప్రకటించుకున్న జగన్మోహన్‌రెడ్డి, ఇద్దరు బిడ్డలు చనిపోతే ఎందుకు మౌనంగా ఉన్నారన్నారు. ఎంఎల్ఎ ఎంఎస్‌బాబు బాధిత కుటుంబానికి అండగా నిలవకపోగా మీడియాకు ముఖం చాటేశారని ఎద్దేవా చేశారు. పోలీసు, న్యాయస్థానాలు ఈ ఘటనను సుమోటోగా తీసుకుని కేసులు నమోదు చేయాలన్నారు. బిడ్డలను కోల్పోయిన కుటుంబానికి ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం అందించాలని డిమాండ్ చేశారు. తక్షణం పాఠశాలలు, గ్రామాల్లోని గుంతలను పూడ్చివేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టి.హేమగిరి, మురార్జీ యాదవ్, దొరబాబు చౌదరి, వెంకటేష్ పాల్గొన్నారు.

రూ.7 లక్షలు ప్రభుత్వ ఆర్థిక సాయం

యాదమరి మండలం తెల్లరాళ్లపల్లిలో ఘటనను తెలుసుకున్న పూతలపట్టు ఎంఎల్ఎ ఎంఎస్‌బాబు, జడ్‌పి వైస్‌ఛైర్మన్ ధనంజయరెడ్డి, రెవెన్యూ డివిజన్ అధికారులు బాధిత కుటుంబానికి రూ.7 లక్షల ఆర్థిక సాయం అందించారు. ప్రభుత్వం తరపున ఈ సాయం అందిస్తున్నటుల వెల్లడించారు. కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు.

200 పనిదినాలు కల్పించాలి

వ్యకాసం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

ఉపాధి కూలీలకు 200 రోజుల పని దినాలు కల్పించాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దడాల సుబ్బారావు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన ఏర్పేడు మండలంలోని మోదుగులపాలెం, సదాశివపురం, కందాడు, శ్రీకాళహస్తి మండలంలోని తొండమనాడు, బొక్కసంపాలెం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల సాధక బాధలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..దేశంలోని పేద ప్రజానీకానికి చేతినిండా పనీ, మూడు పూటలా తిండి పెడుతున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని మోడీ ప్రభుత్వం నిరుగార్చేందుకు కుట్ర చేస్తోందని ఆరోపించారు. ఉపాధి కూలీలపై ఉన్న సవతి ప్రేమతోనే బడ్జెట్లో భారీగా కోత పెట్టిందంటూ ఉద్ఘాటించారు. గత బడ్జెట్లో రూ.90 వేల కోట్లు కేటాయించగా, ఈ బడ్జెట్లో కేవలం రూ.60 వేల కోట్లు మాత్రమే కేటాయించిందని మండిపడ్డారు. దేశవ్యాప్తంగా 20 కోట్ల జాబ్ కార్డులు ఉండగా, అవసరమైన బడ్జెట్ 2.5లక్షల కోట్లనీ, మరి మోడీ ప్రభుత్వం కేవలం 60 వేల కోట్లతోనే సరిపెట్టేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. కొలతలతో నిమిత్తం లేకుండా రోజుకు రూ.600 గిట్టుబాటు కూలి అందజేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి తలారి బాలకృష్ణ పాల్గొన్నారు.



ఉపాధి కూలీల సమావేశంలో...

అధినేత ఆదేశాలే శిరోధార్యం

విభేదాలు వీడిన ఎస్సీవీ, సుధీర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి



టిడిపి శ్రేణులతో బొజ్జల సుధీర్, ఎస్సీవీనాయుడు

శ్రీకాళహస్తి నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి ఎవరన్నది పక్కనబెట్టి అధినేత చంద్రబాబు ఆదేశాలే శిరోధార్యంగా పని చేస్తామని, వచ్చే ఎన్నికల్లో బాబును గెలిపించుకుంటామని మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, ఆ పార్టీ నియోజకవర్గ ఇంచార్జి బొజ్జల సుధీర్ రెడ్డి స్పష్టం చేశారు. శ్రీకాళహస్తిలో, రాష్ట్రంలో వైసీపీ అంతమే పంతంగా ముందుకెళ్తున్నట్లు ఉద్ఘాటించారు. మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడు, బొజ్జల సుధీర్ రెడ్డి విభేదాలు వీడి శుక్రవారం స్థానిక ఎస్సీవీ నివాసం వద్ద మీడియా ముందుకు వచ్చారు. ముందుగా బొజ్జల సుధీర్ రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఎస్సీవీ నాయుడుకు బొజ్జల కుటుంబంతో విడదీయరాని బంధం ఉందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నా, అధికారంలో ఉన్నా ఆయన ఏనాడూ బొజ్జల కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు, ఆరోపణలు చేయలేదన్నారు. ఎస్సీవీ నాయుడుకున్న శక్తి, సామర్థ్యాలు శ్రీకాళహస్తి నియోజకవర్గానికే కాకుండా సూళ్లూరుపేట, వెంకటగిరి, సత్యవేడు, తిరుపతి నియోజకవర్గ ప్రజలకు సైతం తెలుసన్నారు. ఆయన టీడీపీలో, అది కూడా పుట్టినింటికీ చేరితే మరింత బలం చేకూరుతుందన్నారు. ఎస్సీవీ నాయుడుతో పాటు ఆయన అనుచరగణానికి పార్టీలో చేరికపై సాదర ఆహ్వానం పలుకుతున్నామని స్పష్టం చేశారు. పార్టీ కేడర్ ను బలోపేతం చేయడంలో భాగంగా తాను సోషల్ మీడియాలో చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని, అంతే గానీ తమ మధ్య ఎలాంటి విభేదాలు లేవంటూ స్పష్టం చేశారు. శ్రీకాళహస్తి ప్రతిష్టను, అభివద్ధిని కాలగర్భంలో కలిపేస్తున్న ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డిని ఓడించడమే లక్ష్యంగా తామంతా కలిసి నడుస్తామనీ, అంతిమంగా టీడీపీని తిరిగి అధికారంలోకి తెస్తామంటూ ధీమా వ్యక్తం చేశారు. తదనంతరం ఎస్సీవీ నాయుడు మాట్లాడుతూ రాష్ట్రం పరిస్థితి చూస్తుంటే ఆందోళన కలుగుతోందన్నారు. దోపిడీ, దౌర్జన్యాలు ఎక్కువైపోతున్నాయనీ, మహిళల మాన ప్రాణాలకు రక్షణ లేకుండా పోతోందని ఆవేదన వ్యక్తం చేశారు. రాక్షస రాజ్యం పోయి రామ రాజ్యం రావాలంటే చంద్రబాబును గెలిపించుకోక తప్పదన్నారు. కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య చెప్పినట్టు "ఆశయం ఉన్నోడికి అధికారమిస్తే అభివద్ధి చేసి చూపుతాడనీ.. అలా కాకుండా ఆశ ఉన్నోడిని అందలమెక్కిస్తే దోచుకుతింటాడని" ఉదహరించారు. తాను ఏ పదవినీ ఆశించి మాత పార్టీలోకి రాలేదనీ, అధినేత చంద్రబాబు ఎవర్ని అభ్యర్థిగా పెట్టినా శిరసావహించి గెలిపించుకుతీరుతామని స్పష్టం చేశారు. అన్నీ అనుకూలిస్తే ఈ నెల 29న అధినేత చంద్రబాబు సమక్షంలో టీడీపీ లో చేరే అవకాశం ఉందనీ, లేదంటే చేరిక తేదీని త్వరలో ప్రకటిస్తానని ఎస్సీవీ తెలిపారు. మాజీ ఎమ్మెల్యే సత్రవాడ మునిరామయ్య, టీడీపీ నేతలు గాలి చలపతి నాయుడు, దశరథ ఆచారి, రెడ్డి వారి గురవారెడ్డి, డాక్టర్ నైనారు పొన్నారు, గాలి మురళీ నాయుడు, విజయ్ కుమార్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎస్పీ క్యాంపు కార్యాలయం ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

తిరుపతి పోలీస్‌పెరేడ్ మైదానం వద్ద నూతనంగా నిర్మించిన ఎస్పీ నూతన క్యాంపు కార్యాలయ భవనాన్ని రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనుల శాఖా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, డిప్యూటీ సీఎం నారాయణస్వామి శుక్రవారం ప్రారంభించారు. త్రిపుర డిఐజి ఆవుల రమేష్‌రెడ్డి, జిల్లా ఎస్‌పి పి.పరమేశ్వర్‌రెడ్డి సుజల వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. తిరుపతి, శ్రీకాళహస్తి ఎంఎల్‌ఎలు భూమన కరుణాకర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర పోలీస్ హౌసింగ్, కార్పొరేషన్ ఛైర్మన్ చిరంజీవిరెడ్డి, టిటిడి సివిఎస్‌ఒ నరసింహ కిషోర్, మేయర్ డాక్టర్ శిరీష యాదవ్, డిప్యూటీ మేయర్ భూమన అభినయరెడ్డి, అదనపు ఎస్‌పిలు వెంకటరావు, కులశేఖర్, రాజేంద్ర పాల్గొన్నారు.



మామిడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలి

ఏపీ రైతు సంఘం ఉపాధ్యక్షులు వాడ గంగరాజు

ప్రజాశక్తి -బంగారుపాళ్యం

అన్నదాతను ఆదుకోవాలని ఏపీ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వాడ గంగరాజు అన్నారు శుక్రవారం మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్లో ఏపీ రైతు సంఘం పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి శంకరన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ఏడాది, ప్రస్తుతం ప్రకతి వైపరీత్యాలతో పంటలు నష్టపోయిన రైతులను ఆదుకోకపోవడం దారుణమని వెంటనే ఆదుకోవాలని ఈ ఏడాది ఖరీఫ్ సీజన్ మొదలైనందున తక్షణమే పంట నష్టపరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. జిల్లాలో అత్యధికంగా మామిడి రైతులు ఉన్నారని వారికి జిల్లా కలెక్టర్ ప్రకటించిన రేటు ఇవ్వకుండా యాజమాన్యాలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయని మామిడి పరిశ్రమల యాజమాన్యాలపై చర్యలు తీసుకొని రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అత్యధిక సంఖ్యలో ఉన్న పాడి రైతులను ప్రభుత్వం గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని అన్నారు. ఏపీ రైతు సంఘం ఆధ్వర్యంలో 30న విజయవాడలో మహాధర్నా జరుగుతున్నదని ఈ కార్యక్రమానికి జిల్లాలోని రైతులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.

ఆట్టహాసంగా మహాభారత ధ్వజారోహణం

ప్రజాశక్తి - కార్వేటినగరం ద్రౌపతీ ధర్మరాజుల స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు శుక్రవారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా వేకువ జామున సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం వేదపండితులు. వేద మంత్రాలతో ధ్వజారోహణ కార్యక్రమాన్ని చేపట్టి సకల దేవలతను ఆహ్వానిస్తూ ధ్వజపటాన్ని ఆధిరోహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణంలో భాగవతారిణి రెడ్డెమ్మ ఆధ్వర్యంలో హరికథా కాలక్షేపం నిర్వహించారు. అదే విధంగా అమ్మవారికి భక్తుడు మురళీకష్ణ యాదవ్ వెండి శిరస్సును అందించారు. గ్రామ వీధుల్లో ఊరేగిన ద్రౌపదీ అమ్మవారు. వార్షిక మహా భారతమహోత్సవాల్లో భాగంగా ద్రౌపదీ, ధర్మరాజుల స్వామివారు. గురువారం రాత్రి ప్రత్యేక వాహనంపై కొలువు దీరి ప్రత్యేక వాయిద్యాలు, బాణాసంచా పేలుస్తూ గ్రామ వీధుల్లో విహరిస్తూ భక్తులకు ధర్మమిచ్చారు. ఆలయ అధ్యక్షుడు పోకల సోమనాథ్, ప్రధాన కార్యదర్శి హరిబాబు, ఉపాధ్యాయుడు శివ ప్రకాష్, కోశాధికారి బాబురెడ్డి, ఉపకోశాధికారి క్రిష్ణయ్య, పాల్గొన్నారు.

'హథీరాంజీ'ని కాపాడేదెవరు..?

అర్జున్ దాస్ 'యు-టర్న్'కు యత్నం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)



శ్రీ స్వామి హథీరాంజీ మఠాధిపతిగా దశాబ్దాల కాలం ఉంటూ పలు అక్రమాలకు పాల్పడి ధార్మిక పరిషత్తు ద్వారా సస్పెండ్ చేయబడిన మాజీ మఠాధిపతి అర్జున్ దాస్ మళ్లీ మఠాధిపతి స్థానంలో కూర్చోడానికి కోర్టు ద్వారా పావులు కదుపుతున్నారు. గతంలో హథీరాంజీ మఠంలో పర్యవేక్షణాధికారి స్థాయి అధికారి ఒకరు అర్జున్ దాస్ మఠంలో మఠాధిపతిగా ఉంటూ పలు అక్రమాలకు పాల్పడుతున్నారని కోర్టులను ఆశ్రయించారు. ఈ క్రమంలో లోకాయుక్త కోర్టు అర్జున్ దాస్ వ్యవహారంపై విచారణ చేయవలసిందిగా దేవాదాయశాఖ అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. కొన్ని రోజులకు ముందు రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి స్వయంగా మఠాధిపతిగా అర్జున్ దాస్ కొనసాగడానికి అనర్హుడని, ఆయన వివాహం చేసుకున్నాడని, పైగా మఠం ఆస్తులను అన్యాక్రాంతం చేస్తూ కోట్ల రూపాయలు వెనకేసుకున్నాడన్న ఆరోపణలు నిరూపితమైందని ప్రకటించారు. ఇదే నేపథ్యంలో హథీరాంజీ మఠం ఫిట్ పర్సన్ గా రాష్ట్ర ప్రభుత్వం మొదట పార్థసారధిని ప్రకటించి తరువాత అదే స్థానంలో తిరుపతమ్మ దేవాలయం ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ గా విధులు నిర్వహిస్తున్న రమేష్ నాయుడును నియమించింది. రాష్ట్ర ప్రభుత్వం ఎంత వేగంగా నిర్ణయం తీసుకుందో అంతే వేగంతో రమేష్ నాయుడు తిరుపతి హథీరాంజీ మఠంలో బాధ్యతలు చేపట్టి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. ఆగమేఘాలపై మునుపటి ఫైళ్లను తెప్పించుకొని మఠంలో జరిగిన అధికార దుర్వినియోగాలను పరిశీలించి త్వరలోనే మీడియాకు వివరిస్తానని కూడా ప్రకటించేశారు. అయితే మాజీ మఠాధిపతి అర్జున్ దాస్ మఠాధిపతిగా కొనసాగడానికి చేస్తున్న ప్రయత్నాలకు రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ శాఖ అధికారులు ఏ విధంగా స్పందిస్తారో వేచి చూడాలి.

యువగళం పాదయాత్రలకు 'వినతుల' వెల్లువ

ప్రజాశక్తి - బాలాయపల్లి

వెంకటగిరి నియోజకవర్గంలోని బాలాయపల్లి మండలంలోకి ప్రవేశించిన యువగళం పాదయాత్రకు ఎస్సీ, ఎస్టీల నుంచి 'వినతులు' వెల్లువెత్తాయి. శుక్రవారం మండలంలోని నిడిగల్లు, కాట్రగుంట, పిగిలిం, కాముకూరు గ్రామాల మీదుగా పాదయాత్ర సాగింది. ఆయా గ్రామాల ప్రజలు అధినేత నారా లోకేష్‌కు తమ బాధలు చెప్పుకుంటూ వచ్చారు. తాగునీరు, రహదారి సమస్యలు ఉన్నాయని వాపోయారు. అంతర్గత రోడ్లు చినుకుపడితే దోమలు విజృంభిస్తాయని, వ్యాధులతో అల్లాడుతున్నామని చెప్పారు. పిగిలం ఎస్టీ సామాజిక ప్రజలు సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. ఎస్టీ కాలనీలో స్థలం కొరత ఉందని, కుటుంబాలు ఎక్కువగా ఉండడంతో గుడిసెల్లో నివాసం ఉంటున్నామని, హౌసింగ్ పథకం ద్వారా 50 ఇళ్లను మంజూరు చేయాలని, తాగునీటి సమస్య పరిష్కరించాలని, ఇంటింటికీ నీటి కుళాయి ఇప్పించాలని, సిసి రోడ్లు నిర్మించాలని, విద్యుత్



ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులు చేయాలని కోరారు. నారా లోకేష్ స్పందిస్తూ ఎస్సీ ఎస్టీలకు రాజ్యాంగబద్ధంగా దక్కాల్సిన హక్కులను వైసిపి ప్రభుత్వం హరిస్తోందన్నారు. సబ్‌ప్లాన్ నిధులు 5,355 కోట్లను దారి మళ్లించి ఎస్టీ సంక్షేమానికి పాతరేశారన్నారు. సెంటు పట్టా పథకం వైసిపి నేతలు దోచుకోడానికే తప్ప పేద ప్రజల కోసం కాదన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే పిగిలి ఎస్టీ కాలనీలో అర్హులందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని, సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



రామచంద్ర యాదవ్‌ను కలిసిన అభిమానులు

ప్రజాశక్తి -పుంగనూరు

అన్నమయ్య జిల్లా రైల్వే కోడూరు నుంచి సుమారు 150 మంది అభిమానులు శుక్రవారం పుంగనూరులో రాష్ట్ర యువ నాయకులు, వ్యాపారవేత్త బోడే రామచంద్ర యాదవ్‌ను కలిసి నూతన రాజకీయ పార్టీ నిర్ణయంపై సంఘీభావం తెలిపారు. బహుజనులు రాజ్యాధికార సాధన కోసం విజయవాడలో జూలై 23వ తేదీ రాజకీయ పార్టీ ప్రకటన సందర్భంగా విజయవాడలో నిర్వహించే ప్రజా సింహగర్జనకు భారీగా తరలివచ్చి మీకు అండగా, మీ వెంటే ఉంటామని తెలిపారు. రైల్వే కోడూరు పర్యటనకు రావాలని రామచంద్ర యాదవ్‌ను వారు ఆహ్వానించారు. రామచంద్ర యాదవ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రజలు రాజకీయ మార్పు కోరుతున్నారని, త్వరలో రాజకీయ పార్టీ, మేనిఫెస్టో ప్రకటిస్తామని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, వెనకబడిన వర్గాలు ఏకం కావలసిన సమయం ఆసన్నమైంది. వచ్చేనెల 23 ప్రజా సింహ గర్జన బహిరంగ సభను విజయవంతం చేయడానికి ప్రతి ఒక్కరు కషి చేసి సహకరించాలి అన్నారు. కువైట్ నుంచి వచ్చిన శ్రీనివాసులు, రామకష్ణ, శంకర్, సుబ్బ నరసయ్య, రాజేంద్ర, రజినిలు రామచంద్ర యాదవ్ ను ఘనంగా సన్మానించి సంఘీభావం తెలిపారు. రైల్వే కోడూరు ఈశ్వర్, సురేష్, వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ఛార్జీలపై వామపక్షాల 'పోరుబాట'

క్షేత్రస్థాయిలో బిల్లులు పరిశీలన
30న విద్యుత్ సబ్‌స్టేషన్ల ముట్టడి



బిఎన్ కండ్రిగలో..

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి, బిఎన్ కండ్రిగ, నాయుడుపేట

పెరిగిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా ఈ నెల 24వ తేదీ నుంచి సిపిఎం, సిపిఐ నాయకులు పోరుబాట పట్టనున్నారు. ఆ మేరకు స్థానిక పుచ్చలపల్లి సుందరయ్య భవనంలో శుక్రవారం సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో 'కరెంటు బిల్లులతో జనానికి షాక్' కరపత్రాలను విడుదల చేశారు. అనంతరం సిపిఎం నియోజవర్గ ఇన్చార్జి అంగేరి పుల్లయ్య, సిపిఐ ఇన్చార్జి జనమాల గురవయ్య సంయుక్తంగా మాట్లాడుతూ జగన్మోహన్ రెడ్డి విద్యుత్ చార్జీల తగ్గింపు పై ప్రజలకు ఇచ్చిన హామీని తుంగలో తొక్కేసారని విమర్శించారు. కార్పొరేట్లకు మేలు చేకూర్చేలా విద్యుత్ ఒప్పందాలు చేసుకుంటున్నారని ఆరోపించారు. తద్వారా మూడు రూపాయలకు కొనాల్సిన యూనిట్ ను రూ.10 నుంచి రూ.20 కొనుగోలు చేస్తూ కార్పొరేట్లకు దోచిపెడుతున్నారని మండిపడ్డారు అసలు చార్జీలు ఐదు శాతం ఉండగా, కొసరు చార్జీలు 95 శాతం ఉండడం విడ్డూరమని ఎద్దేవా చేశారు. సర్దుబాటు చార్జీల పేరుతో రూ.6వేల భారం మోపిన జగన్ ప్రభుత్వం స్మార్ట్ మీటర్లు పెట్టి ప్రజల గొంతు కోసేందుకు పూనుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ చార్జీల పెంపుకు నిరసనగా వామ పక్ష నాయకులు శనివారం నుంచి 30వ తేదీ వరకు క్షేత్రస్థాయి పర్యటనకు వెళ్లాలని సూచించారు. ఈనెల 30న జరిగే విద్యుత్ సబ్‌స్టేషన్ల ముట్టడి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. గంధం మణి, పెనగడం గురవయ్య, శివ కుమార్, గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

బిఎన్ కండ్రిగలో.. విద్యుత్ ఛార్జీల భారాలకు వ్యతిరేకంగా 30న విద్యుత్ సబ్‌స్టేషన్ల వద్ద జరిగే ధర్నాల్లో ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు పిలుపునిచ్చారు. శుక్రవారం నియోజకవర్గ ఇన్‌ఛార్జి దాసరి జనార్ధన్ ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం 2014 నుంచి ఇప్పటివరకూ వినియోగించిన విద్యుత్



నాయుడుపేటలో..



శ్రీకాళహస్తిలో..

మీద సుంకాల పేరుతో, సర్‌ఛార్జీల పేరుతో, ట్రూఅప్ పేరుతో వివిధ రకాలుగా భారాలో వేస్తోందన్నారు. ఈ దోపిడీకి వ్యతిరేకంగా ప్రజలందరూ కలిసి విద్యుత్ ఛార్జీల పెంపును నిరసిస్తూ ఆందోళనలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎం.రమేష్, నాగలాపురం నాగరాజు, ఆర్.మురగేష్, ఆర్.మునిశంకర్, ఎన్.రమణయ్య, బాలగురవయ్య, చిన్న గురవయ్య, సుబ్బయ్య, తిరుపాలు పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి 'విద్యుత్ భారాల కరపత్రాలను' పంపిణీ చేశారు.

నాయుడుపేటలో... : ప్రజలపై కేంద్రం విధిస్తున్న గ్యాస్, పెట్రోల్ ధరలు చాలవన్నట్లు కరెంట్ బిల్లుల పెంపుతో రాష్ట్ర ప్రభుత్వం జనం నడ్డి విరుస్తోందని సిపిఎం ఆధ్వర్యంలో కరపత్రాలను పంపిణీ చేశారు. శుక్రవారం నాయుడుపేట బీడీకాలనీ, లోతువానిగుంటలలలో కరపత్రాలను పంపిణీ చేశారు. 30న విద్యుత్ సబ్‌స్టేషన్ల ఎదుట ఆందోళన చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు శివకవి, ముకుంద పాల్గొన్నారు.

జగనన్న సురక్ష ఒక అద్భుతం :మంత్రి ఆర్కేరోజా



ప్రజాశక్తి-నగరి : జగనన్న సురక్ష ఎంతో అద్భుతమైన కార్యక్రమని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా అన్నారు. తన క్యాంప్ కార్యాలయంలో జగనన్న సురక్ష కార్యక్రమంపై విజయపురం మండల ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, వాలంటీర్లు, గృహసారధులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు ఏ కారణంచేత అర్హులకు ఆగకూడదు పార్టీలకు, కులమతాలకు సంబంధం లేకుండా అర్హత ఉన్న అందరికీ పథకాలు, కావలసిన సర్టిఫికేట్లు అందాలన్న జగనన్న ఆశయాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా స్వీకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా వాలంటీర్లు, గృహసారధులు, ప్రజా ప్రతినిధులు ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వ పథకాలు, సర్టిఫికేట్‌లకు సంబంధించి సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కావలసిన పత్రాలను అప్పుడే సేకరించి వాటిని సచివాలయాల్లో పొందుపరచి టోకన్లు అందజేయాలన్నారు. వారం రోజుల తర్వాత మండల స్థాయి అధికారులు ప్రతి సచివాయల పరిధిలో ఒకరోజు ఉండి పరిశీలించిన వివరాలను జిల్లాస్థాకి అధికారుల దృష్టికి తీసుకెళ్లి అక్కడికక్కడే పథకాలు అందడంలో ఉన్న సమస్యలు పరిష్కరించడం, ఏ కారణం చేత రాలేదో తెలియపరచడంతో పాటు వివిధ సర్టిఫికేట్లకు దరఖాస్తు చేసుకున్నవారికి వాటిని అక్కడే అందజేస్తారన్నారు. ఇంటివద్దకే పరిపాలన తీసుకువచ్చి వారి సమస్యలు పరిష్కరిండంతో పాటు, ఇంటివద్దకే పెన్షన్, లబ్ధిదారుల ఖాతాలకే ప్రభుత్వ సాయం అంటూ ఎలాంటి అవకతవకలు లేకుండా పరిపాలన చేపడుతున్న ఘనత జగనన్నకే దక్కుతుందన్నారు. జగనన్న సురక్ష ఒక అద్భుతమని ప్రతి ఇంటి గురించి ఇంత శ్రద్ధ తీసుకొని పనిచేసే ముఖ్యమంత్రి మనకుండటం అదృష్టమన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు గోపీనాథ్, మండల సచివాలయ కన్వీనర్ రాజగోపాల్, కుమార్, రాజేంద్ర, శేఖర్ రాజు, గోపి, నారపరాజు, భాస్కర్‌రాజు, జ్యోతి, సరస్వతి, బాబు, పాండియన్, సుబ్రమణ్యం, గృహ సారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష పథకాన్ని విజయవంతం చేయండి



ప్రజాశక్తి - గుడిపాల : మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయంలో జగనన్న సురక్ష పథకం ఎంపీపీ ప్రసాద్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ప్రసాద్‌రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ప్రవేశ పెట్టిన జగనన్న సురక్ష పథకం విజయవంతం చేయాలని వాలంటరీలకు డిజిటల్ అసిస్టెంట్లకు గ్రామ డెవలప్మెంట్ ఆఫీసర్లకు సూచించారు. ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం పెండింగ్లో ఉన్న బిల్డింగ్స్ సిసిరోడ్లు సకాలంలో పూర్తి చేయాలని సూచించారు పథకాలు అర్హులైన పేదలకు అందకపోవడంతో పేద ప్రజలు నిరాశ చెందకుండా అర్హులైన పేదలు ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందించడమే ఈ పథక ముఖ్య ఉద్దేశమని సచివాలయం సిబ్బందికి సూచించారు. అర్హులైన ప్రజలకు జననా ధ్రువ మరణ ధ్రువ పత్రాలను అక్కడికక్కడే పరిష్కరించి వెంటనే లబ్ధిదారుల చేతిలోకి నేరుగా ఇవ్వడం జరుగుతుందని ఎంపీపీ ప్రసాద్ రెడ్డి అధికారులకు సూచించారు .వెంటనే జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో వచ్చిన ఫిర్యాదుల ఆధారంగా ఆయా శాఖలకు సంబంధించిన అధికారులు సచివాలయం సందర్శించి వాలంటీర్ల ద్వారా సమస్య తెలుసుకొని ఆ సమస్య వెంటనే అధికారుల సమక్షంలో తీర్చడమే జగనన్న సురక్ష పథకం ముఖ్య ఉద్దేశం అని వాలంటరీలకు సూచించారు ప్రతి ఒక్క వాలంటరీ తమ పరిధిలోగల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకు రావాలని సమస్యలు పరిష్కారం కాకపోతే వెంటనే అధికారుల తో చెప్పి ఆ సమస్యను పరిష్కరించాలని వాలంటరీలకు సూచించారు ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పనిచేస్తున్న వాలంటరీలను అభినందించారు గృహ సారధులు వాలంటరీలు పంచాయతీ సెక్రెటరీ డిజిటల్ అసిస్టెంట్లు మండల డెవలప్మెంట్ ఆఫీసర్స్ అందరూ కలిసికట్టుగా తమ తమ గ్రామంలో ఉండే సమస్యలను జగనన్న సురక్ష పథకం ద్వారా పరిష్కరించుకోవాలని ఆయన సూచించారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రాజశేఖర్ రెడ్డి పిఆర్ ఏఈ జయచంద్రరెడ్డి ఎంపిటీసీలు సర్పంచులు సెక్రటరీలు డిజిటల్ అసిస్టెంట్లు అందరూ పాల్గొన్నారు

తల్లీబిడ్డ వైద్యానికి రూ.7.50 లక్షలు సీఎం సహాయనిధి

పేరం మోనిషాకు చెక్కు పంపిణీ చేసిన మంత్రి ఆర్కేరోజా



ప్రజాశక్తి-నగరి : నిండ్ర మండలం, చవరంబాకం గ్రామానికి చెందిన పేరం మోనిష ప్రసవ సమంలో తీవ్ర చిక్కులను ఎదుర్కొంది. మేజర్ ఆపరేషన్ చెయ్యాల్సి ఉంటుందని అప్పుడే ప్రసవం అవుతుందని తెల్పారు. దీంతో మేజర్ ఆపరే షన్ చేయాల్సి వచ్చింది. పుట్టిన బిడ్డ అస్వస్థతకు లోనుకా వడంతో ప్రత్యేక వైద్యచికిత్స అందించాల్సి వచ్చింది. దీంతో పేరం మోనిషా కుటుంబ సభ్యులు అప్పులు చేసి రూ.8 లక్షలకు పైగా ఖర్చు చేశారు. మంత్రి ఆర్కేరోజానుకలిసి తమ పరిస్థితిని వివరించి సాయం చేయాలని కోరారు. తల్లిమ నస్సుతో ఆలోచించి దీనిపై స్పందించిన మంత్రి ఈ అంశాన్ని సీఎం సహాయనిధి విభాగానికి తీసుకెళ్లి రూ. 7.50 లక్షలు మంజూరు చేశారు. శుక్రవారం సహాయనిధి చెక్కును మంత్రి ఆర్కేరోజా పేరం మోనిషాకు అందజేశారు. ఇది జీవితాంతం మరువలేని సాయమని లబ్ధిదారు ఆనందభాష్పాలు విడిచింది. ఈ కార్యక్రమంలో నిండ్ర మండల ప్రజా ప్రతినిధులు వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

తహశీల్దార్ లక్ష్మి నారాయణకు సన్మానం



ప్రజాశక్తి - వెదురుకుప్పం: ఇటీవల తిరుపతి జిల్లా నుండి చిత్తూరు జిల్లా వెదురుకుప్పం మండలం తహశీల్దారుగా బదిలీపై వచ్చిన డి.లక్ష్మీనారాయణ శుక్రవారం మండలం లోని రాజకీయ పార్టీ నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. సన్మానించిన వారిలో మాజీ సర్పంచ్, అడ్వకేట్ గుండెకాయల బాబు, సామాజిక సేవ కార్యకర్తలు కొత్తపల్లి జాకబ్, వాసు రెడ్డి తదితరులు తాసిల్దార్ ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తాసిల్దార్ లక్ష్మీనారాయణ మాట్లాడుతూ తమకు అందరూ సహాయ సహకారాలు అందించాలని అప్పుడే ఇక్కడ సమస్యలన్నీ పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు

భూసార పరీక్షలతో భూమిఆరోగ్యం



ప్రజాశక్తి -సోమల: రైతులు తమ పొలంలోని మట్టి సేకరణ చేసి భూసార పరీక్షలకు పంపించి తద్వారా వచ్చే ఫలితాల ఆధారంగా ఎరువులు ఇతర మందులు వాడి పెట్టుబడి తగ్గించుకొని అధిక దిగుబడులు సాధించవచ్చు నని, అంతే కాకుండా భూసార పరీక్షలతో భూమి ఆరోగ్యంగా ఉండడం పర్యావరణానికి కూడా ఎంతో మేలు చేసిన వారు అవుతారని సహాయ వ్యవసాయ సంచాలకులు శివకుమార్ అన్నారు. మండలంలోని నంజంపేట రైతు భరోసా కేంద్ర పరిధిలో శుక్రవారం భూసార పరీక్షల విధానం మట్టి సేకరణ తద్వారా రైతుకు చేకూరే లాభాల పై రైతులకు అవగాహన కల్పించి సమీపంలోని పొలంలో భూసార పరీక్ష నిర్వహించారు. ప్రతి ఒక రైతు తమ పొలంలో మట్టిని సేకరించి పలు రకాలుగా మట్టిని విభజించి దానిని ప్రత్యేక కవర్లో భద్రపరిచి వ్యవసాయ శాఖ అధికారులకు అందజేసి భూసార పరీక్షలు చేయించుకోవడం ద్వారా ప్రతి ఏడాది భూమిలో ఎంత మేర సారవంతం ఉంది ఏ పంటకు ఏ విధమైన ఎరువులు మందులు వాడాలి తదితర అంశాలు రైతుకు తెలిసి పెట్టుబడి తక్కువ పెట్టి అధిక లాభాలు పొందే అవకాశం ఉందని వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు భరోసా కేంద్ర అధికారి రాధిక, రైతులు పాల్గొన్నారు.

యువ ఉత్సవంలో డిగ్రీకళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రజాశక్తి- నగరి : మినిస్ట్రీ ఆఫ్ యూత్ అఫైర్స్, స్పోర్ట్స్ ఇండియా తరపున చిత్తూరు నెహ్రూయువ కేంద్రం నిర్వహించిన జిల్లాస్థాయి యువ ఉత్సవంలో ప్రభుత్వ డిగ్రీకళాశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. గ్రూప్ డాన్స్ (ఫోక్)లో ద్వితీయ స్థానంలో నిలిచి రూ.2500 నగదు బహుమతి, మెమెంటో, సర్టిఫికేట్లు కైవసం చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.వేణుగోపాల్ తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులు విజయ లక్ష్మి, విశాలాక్షి, రేష్మ, మేఘన, గాయత్రి, లోకేశ్వరిలను శుక్రవారం ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు.

నియామక పత్రాలు అందజేత

ప్రజాశక్తి -సోమల: మండలంలోని మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు పంచాయతీకి సంబంధించి తుడుము వారి పల్లి గ్రామంలోని అంగన్ వాడి కార్యకర్తగా శ్రావణి ఎంపిక కావడంతో ఆమెకు, పెద్ద ఉప్పరపల్లి పంచాయతీ లోని అంగన్వాడీ కేంద్రంలో హెల్పర్‌గా ఎంపికైన అఫ్రీన్‌కు ఎంపీపీ ఈశ్వరయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, సర్పంచులు నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు. నియామక పత్రం అందుకున్న ఇరువురు మంత్రి పెద్దిరెడ్డి రామ చంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు.

వెంకటరమణ రెడ్డి సతీమణి మృతి పట్ల పలువురి సంతాపం



ప్రజాశక్తి-పెద్దపంజాణి: మాజీ మంత్రి ఎన్. అమరనాథ రెడ్డి మాజీ వ్యక్తిగత సహాయకులు వెంకట్రమణా రెడ్డి సతీమణి నాగమణి మృతి పట్ల శుక్రవారం పలువురు నివాళులర్పించారు.ఈ సందర్భంగా మాజీ మంత్రివర్యులు అమరనాథ రెడ్డి, సతీమణి రేణుకా రెడ్డి,తనయుడు ప్రసేన్ రెడ్డి, సోదరుడు శ్రీనాథ్ రెడ్డి మండలంలోని మల్ల సముద్రం గ్రామానికి చేరుకొని ఆమె భౌతిక కాయాన్ని సందర్శించి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వెంకట రమణారెడ్డి కుటుంబీకులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. అదేవిధంగా పలమనేరు నియోజకవర్గంతో పాటు జిల్లాకు చెందిన పలువురు తెలుగుదేశం పార్టీ నేతలతో పాటు పలువురు వైకాపా నేతలు సైతం ఆమె మృతికి సంతాపాన్ని తెలియజేశారు.

ఉపాధ్యాయురాలికి సన్మానం

ప్రజాశక్తి-సోమల: మండలంలోని చింపిరెడ్డిపల్లి గ్రామంలో 31 సంవత్సరాలుగా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేసి బదిలీపై వెళ్లిన చాముండేశ్వరమ్మను గ్రామస్తులు, సహచర ఉపాధ్యా యులు పాఠశాల కమిటీ సెంబర్లు శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఎయిడెడ్ పాఠశాలగా ప్రారంభమైన పాఠశాలలో ఉపాధ్యాయురాలుగా 31 సంవత్సరాలు విధులు నిర్వహించి ఎంతోమందికి మంచి చదువును అందించి ఉన్నత శిఖరాలకు చేర్చిన చాముండేశ్వరమ్మను దుశ్శాలువతో ఘనంగా సన్మానించారు. ఆమె సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుధాకర్ నాయుడు, సర్పంచి వనజమ్మ, వైసిపి నాయకులు రమణారెడ్డి, పాఠశాల సిబ్బంది గ్రామస్తులు పాల్గొన్నారు.

పత్తికొండలో 'గడపగడపకు మన ప్రభుత్వం'



ప్రజాశక్తి-గంగవరం: పత్తికొండ సచివాలయ పరిధిలో శుక్రవారం జరిగిన 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో ఎమ్మెల్యే వెంకటే గౌడ పాల్గొని 467 గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవరత్నాల అమలుతో నిరుపేదల జీవితాలు మెరుగుపడ్డాయని.. అమలవుతున్న సంక్షేమ పథకాలను వివరిస్తూ గత మూడేళ్లలో గ్రామంలో ఏ మేరకు అభివద్ధి జరిగిందో తెలిపారు. సీఎం వైఎస్ జగనన్న ప్రవేశ పెట్టిన నవరత్నాల సంక్షేమ ఫలాలు ప్రజలకు తెలియజేశారు. అలాగే పత్తికొండ సచివాలయంలో జగనన్న ప్రారంభించిన ' జగనన్న సురక్ష ' కార్యక్రమాన్ని వీక్షించారు. కార్యక్రమంలో సర్పంచ్, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కట్టడాలపై ఉక్కుపాదం



ప్రజాశక్తి- తొట్టంబేడు: అక్రమ కట్టడాలపై రాజీవ్‌నగర్ వీఆర్‌వో విజయ్ కుమార్ ఉక్కు పాదం మోపారు. అక్రమంగా ఇల్లు నిర్మాణం చేస్తే సహించేది లేదన్నారు. నిజమైన పట్టాదారుడు తప్ప రాజీవ్ నగర్‌లో ఎవరైనా ఆక్రమిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఖాళీ స్థలంలో ఇల్లు నిర్మించుకోవాలంటే తహశీల్దారు కార్యాలయానికి వచ్చి పట్టాను చూపించిన తరువాతే ఇల్లు నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. శుక్రవారం శ్రీకాళహస్తి పట్టణ తహశీల్దారు రూప్‌చంద్ ఆదేశాల మేరకు శ్రీకాళహస్తి- పిచ్చాటూరు ప్రధాన రోడ్డు మార్గంలో రాజీవ్‌నగర్‌లోని గిరిజన గురుకుల కళాశాల సమీపంలో రోడ్డుకు ఆనుకొని ఉన్న అక్రమ కట్టడాలను శుక్రవారం తొలగించారు. ఆక్రమణలు తొలగించేటప్పుడు ఎవరైనా అడ్డుపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

విద్యార్థులకు విద్యాసామగ్రి వితరణ



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండలం బట్టీకండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని 40 మంది విద్యార్థులకు శుక్రవారం అదే గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యంరాజు విద్యాసామగ్రి అందించారు. ఎంఈవో తులసీరామ్ మాట్లాడుతూ విద్యార్థులు దాతల సాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. దాతను పేరెంట్స్ కమిటీ సభ్యులు, గ్రామస్థులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు రవిశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు జయశ్రీ, ప్రభావతి, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా తాగునీటి ట్యాంకు



ప్రజాశక్తి-గూడూరు: గూడూరు పట్టణంలోని సొసైటీ (వాలయనందపురం) ప్రాంతంలో ఓవర్‌హెడ్ ట్యాంక్ ఏ క్షణంలోనైనా కూలేందుకు సిద్ధంగా ఉంది. రాణిపేట, సొసైటీ, నెహ్రూనగర్, మఠం వీధి, వాలయనందపురం ప్రాంతాలకు మంచి నీటి సరఫరా అందించే ఈ వాటర్ ట్యాంక్ నిర్వహణ లోపంతో పూర్తి శిథిలావస్థకు చేరుకుంది. ట్యాంక్ శుభ్రం చేసేందుకు వీలు లేకుండా ట్యాంక్ పైకి వెళ్లే మెట్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. ట్యాంక్‌ను శుభ్రపరిచి ఏళ్లు గడుస్తుండటంతో ట్యాంక్ నీటిని వాడుకునేందుకు స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. నీటిని వినియోగించక పోవడంతో ట్యాంక్‌లో నీటి నిల్వలు పేరు కుపోయి ఏ సమయంలో అయినా కూలే స్థితిలో ఉంది. ఈ ప్రాంతంలోనే పాఠశాలలు, నివాసాలు ఉండటంతో స్థానికులు భయాందోళనలో జీవనం సాగిస్తున్నారు. మునిసిపల్ అధికారులు వెంటనే స్పందించి పాత ట్యాంక్ ను పరిశీలించి దాని స్థానంలో నూతన ట్యాంక్ నిర్మాణానికి చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

విద్యార్థులకు బహుమతుల ప్రదానం



ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి: మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల వెంగంవారిపల్లిలో తల్లిదండ్రుల సమావేశంలో ఆదర్శ పాఠశాలకు ఎంపికైన ఎనిమిది మంది విద్యార్థులకు పంచాయతీ సర్పంచ్ రవిచంద్రబాబు, పాఠశాల కమిటీ ఛైర్మన్ శ్రీనివాసులు, వైస్ ఛైర్మన్ సతీష్, మునిరత్నమ్మ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రవీంద్రనాయక్ ఆధ్వర్యంలో అభినందించారు. విద్యార్థులు భవ్య శ్రీ, హరీష్, హర్షిత, తేజేష్, చరణ్, యశ్వంత్, చరణ్ తేజ్, మహాలక్ష్మిలను అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఝాన్సీ రాణి, రవి, శశికుమార్, నాగరాణి, రెడ్డమ్మ, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరం



ప్రజాశక్తి-రేణిగుంట: కరకంబాడి తారకరామానగర్‌లో శుక్రవారం రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ సభ్యుల సౌకర్యార్థం, టాటా ట్రస్ట్ వారిచే ఉచిత క్యాన్సర్ వైద్య శిబిరాన్ని నిర్వహించారు. రాస్ ఆధ్వర్యంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను విధిగా నిర్వహించడంతోపాటు.. మహిళలను ఆర్థికంగా బలోపేతం చేయడమే కాకుండా, సభ్యులకు చేతివత్తులు నేర్పించి, వారి ఆర్థిక నైపుణ్యానికి దోహద పడుతున్నారన్నారు. రక్తపోటు, మధుమేహం, హెపటైటిస్ బి అండ్ సి, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లకు సంబంధించిన పరీక్షలు డాక్టర్ భార్గవ్ బందంచే ఉచితంగా అందించారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్ సిబ్బంది, ఆశ వర్కర్లు, ట్రస్ట్ సిబ్బంది, ట్రస్టీలు తదితరులు పాల్గొన్నారు.

మంత్రి కాకాణికి

లలిత జ్యువలర్స్ ఆహ్వానం

ప్రజాశక్తి-గూడూరు టౌన్: ప్రముఖ నగల వ్యాపారి లలితా జ్యువలర్స్ మేనేజింగ్ డైరెక్టర్ కిరణ్ కుమార్ శుక్రవారం గూడూరు పట్టణంలో శనివారం ప్రారంభించనున్న లలితా జ్యువలర్స్ షోరూమ్ ప్రారంభోత్సవానికి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వ్యవసాయ శాఖ, సహకార మార్కెటింగ్ ఫుడ్ ప్రాసెసింగ్ శాఖామంత్రి డాక్టర్ కాకాణి గోవర్ధన్ రెడ్డి ని నెల్లూరులోని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వానించారు. నుడా ఛైర్మన్ ముక్కల ద్వారకనాథ్ తదితరులు పాల్గొన్నారు.



బంగారుపాళ్యం ఎస్ఐగా రాంభూపాల్



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: బంగారుపాలెం ఎస్ఐగా రాంభూపాల్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న మల్లికార్జునరెడ్డి బదిలీపై అన్నమయ్య జిల్లా లక్కిరెడ్డిపల్లికి బదిలీపై వెళ్లాడు. ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రశాంత వాతావరణం సృష్టించేందుకు చర్యలు చేపడుతానని తెలిపారు.

కోట టీడీపీ మండలాధికార ప్రతినిధిగా చైతన్య



ప్రజాశక్తి-కోట: టిడిపి మాజీ శాసనసభ్యులు పాశం సునీల్ కుమార్ ఆదేశాల మేరకు మండలాధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమ్‌రెడ్డి ఆధ్వర్యంలో కోట మండల అధికార ప్రతినిధిగా దాసరి చైతన్యను నియమించారు. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించినందుకు మండల అధ్యక్షుడు మద్దాలి సర్వోత్తమ్‌రెడ్డి, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ జలీల్ అహ్మద్, నాయకులకు కతజ్ఞతలు తెలిపారు. టిడిపి పార్టీ నియమ నిబంధనలను అనుసరించి టీడీపీ పార్టీ బలోపేతానికి కషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు నెల్లూరు. మోహన్ రెడ్డి, తీగల సురేష్‌బాబు, షేక్.షంసుద్దీన్, చంద్రశేఖర్, కోకర్ల మధు యాదవ్, తిరుమూరు మురళీ తదితరులు పాల్గొన్నారు.

పిల్లల్ని పనిలో పెట్టుకుంటే చర్యలు



ప్రజాశక్తి-బంగారుపాళ్యం: పిల్లలను పనిలో ఉంచుకోరాదని.. బాల కార్మికులను గుర్తించి విధిగా పాఠశాలలకు పంపాలని సీఐ నాగరాజురావ్ అన్నారు. శుక్రవారం పోలీస్ స్టేషన్లో స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు పిల్లలను పనిలో ఉంచుకోరాదని.. 18 ఏళ్లకు పైబడిన యువతీ యువకులను పనిలో ఉంచుకోవాలన్నారు. కార్యక్రమంలో చిత్తూరు లేబర్ అధికారి హేమాచారి, ఐసిపిసిఎస్ మెంబర్ ప్రతిమ, పలువురు జి ఎం ఎస్ కే లు, స్వచ్ఛంద సంస్థలు తదితరులు పాల్గొన్నారు.

మహాభారత ఉత్సవాలు ప్రారంభం



ప్రజాశక్తి-వెదురుకుప్పం: మండలంలోని పచ్చికాపల్లంలో ద్రౌపదీ సమేత ధర్మరాజులస్వామి ఉత్సవాలకు బుధవారం అంకురార్పణ జరిగింది. ఆలయ పెద్దలు అమ్మవారి పూజా సామాగ్రిని పచ్చికాపలం పురవీధుల మీదుగా ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం పూజలు చేపట్టారు.

ద్విచక్ర వాహనాన్ని
బస్సు ఢీకొని-ఇద్దరి మృతి






ప్రజాశక్తి-శాంతిపురం: మండల పరిధిలోని కడపల్లి సమీపంలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల వద్ద శుక్రవారం ఉదయం ఓ ద్విచక్ర వాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొంది. ప్రమాదంలో ఇద్దరు యువకులు ప్రాణాలు కోల్పోయారు. రాళ్లబూదుగూరు పోలీసుల కథనం మేరకు.. కెనమాకులపల్లి పంచాయతీ బోయినపల్లి గ్రామానికి చెందిన నాగభూషణం చెంగమ్మల ఏకైక కుమారుడు శివరాం (22) కుప్పం నుండి తమ సొంత పనిపై వెళ్లి తిరిగి వస్తుండగా డిగ్రీ కళాశాలలో పరీక్ష రాసి వస్తున్న అదే గ్రామానికి చెందిన మురుగన్, సుమతి దంపతుల తనయుడు బాలు (23)ను తన వెంట తీసుకువస్తుండగా కడపల్లి సమీపంలోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాల ఎదురుగా వి.కోట వైపు నుండి వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది . ప్రమాదంలో శివరాం సంఘటనా స్థలంలోనే ప్రాణాలు కోల్పోయాడు. మరో యువకుడు బాలును స్థానికులు పిఈఎస్ ఆసుపత్రికి 108 వాహనంలో తరలించగా చికిత్స పొందుతూ బాలు మృతి చెందినట్లు పిఈఎస్ మెడికల్ కళాశాల వైద్యులు నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రమాదంలో ఒకరికి గాయాలు

ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల కేంద్రంలోని బీసీ గురుకుల పాఠశాల సమీపంలోని జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన బైక్ ప్రమాదంలో కష్ణమోహన్ రెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి.



కష్ణమోహన్ రెడ్డి సూళ్లూరుపేట నుండి నాయుడుపేటకు స్కూటీ బైక్ పై వెళ్తుండగా అదుపుతప్పి డివైడర్ను ఢీకొనడంతో బైక్ బోల్తా పడింది. మొబైల్ అంబులెన్స్ రావడంతో అతడిని చికిత్స నిమిత్తం సూళ్లూరుపేట ఆసుపత్రికి తరలించారు.

అక్రమ మందుల విక్రయాలపై దాడులు



ప్రజాశక్తి-తిరుపతి అర్బన్ : సెబ్ ఇన్‌స్పెక్టర్ నాగరాజురెడ్డి, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ సుభాషిణి తన సిబ్బందితో కలిసి పెదకాపు వీధిలోని హరిత ఇంట్లో శుక్రవారం సాయంత్రం దాడులు చేపట్టారు. బిల్లులు లేకుండా మత్తు కలిగించే మందులను విక్రయిస్తున్నట్లు తెలుసుకున్న అధికారులు దాడులు చేశారు. ఎస్ఎల్ఎన్ మెడికల్ షాపు యజమాని హరిత వద్ద పలు మందులను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేశారు.

విధుల్లో 15 మంది
ఉపాధ్యాయులు

ప్రజాశక్తి-వెంకటగిరి: డీఎస్సీ-1998లో అర్హత సాధించిన వారికి ప్రాథమిక పాఠశాలల్లో రెండో టీచర్లుగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. ఎంఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ మండలానికి 20 మంది ఉపాధ్యాయులను ప్రభుత్వం పంపిన ఉత్తర్వుల మేరకు 15 మంది విధుల్లో చేరినట్లు తెలిపారు.

ప్రాచీన తాళపత్ర గ్రంథాలను పరిశోధించాలి

ప్రజాశక్తి-క్యాంపస్: తిరుపతిలోని సంస్కృత విశ్వవిద్యాలయంలో శోధ సమావేశ సమాపన, సమరోహం శుక్రవారం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా సెంట్రల్ సాంస్క్రిట్ యూనివర్సిటీ ముంబై క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్ ఎన్ పాండే విచ్చేశారు. సభాధ్యక్షులుగా కుమార భాస్కర వర్మ సంస్కృత విశ్వవిద్యాలయం, అస్సాం ఉప కులపతి ఆచార్య ప్రహ్లాద ఆర్ జోషి విచ్చేశారు. ముఖ్య అతిథులుగా విచ్చేసినటువంటి ప్రొఫెసర్ ఎల్.ఎన్ పాండే మాట్లాడుతూ పరిశోధక విద్యార్థులు సంస్కృత భాష ప్రచారము కొరకు ప్రాచీన తాళపత్ర గ్రంథాలను చక్కగా పరిశోధించి ప్రపంచానికి తెలియజేయాలని కోరారు. తాళపత్ర గ్రంథాలను పరిశోధన చేసేటప్పుడు సత్యమైన విషయాలను ప్రపంచానికి వెంటనే తెలియజేయాలని అది కూడా సంస్కృత భాష ఆధారంతో ఇతర భాషలందు తర్జుమా చేసి తెలపాలని కోరారు. సభాధ్యక్షులుగా వ్యవహరించిన ఆచార్య ప్రహ్లాద్ ఆర్. జోషి సంస్కృత పరిశోధకులు అందరూ నూతన ఆవిష్కరణల కొరకు మోడరన్ టెక్నాలజీని కూడా పరిగణనలోకి తీసుకోవాలని విద్యార్థులను కోరారు. ఆధునికతతో కూడా ప్రాచీన



సంప్రదాయ పరిశోధన కూడా చేయాలని విద్యార్థులకు తెలియజేశారు. ఈ శోధన సమావేశమునకు తిరుపతి సంస్కర్త విశ్వవిద్యాలయంలో ఉన్నటువంటి సుమారు 135 మంది విద్యార్థులు పాల్గొనగా ఈ రిసర్చ్ కొలీజియం సంయోజకులుగా ఆచార్య సత్యనారాయణ వ్యవహరించగా సహసంయోజకులుగా డాక్టర్ బలి చక్రవర్తి వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డీన్ సాహిత్య, సంస్కృతి ఆచార్య లలితారాణి, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ ఆచార్య రాధా గోవింద త్రిపాఠి, పరీక్షా నియంత్రకులు ఆచార్య సాంబశివమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

మంత్రి బొత్స సత్యనారాయణను
కలిసిన ఉపకులపతి ఆచార్య భారతి

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం ఉపకులపతిగా నూతనంగా పదవీ బాధ్యతలను స్వీకరించిన ఆచార్య డి. భారతి శుక్రవారం విజయవాడలో విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణని వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో తనపై నమ్మకంతో ఉపకులపతి బాధ్యతలను ఇచ్చినందున కతజ్ఞతలు తెలిపారు. కొత్తగా బాధ్యతలు చేపట్టిన ఉపకులపతికి యూనివర్సిటీని అన్ని విధాలుగా ముందంజ లో తీసుకెళ్లాలని సూచించారు. ఆచార్య డి. భారతి మంగళగిరిలోని ఉన్నత విద్యా శాఖ కార్యాలయంలోని విద్యాశాఖ చైర్మన్ హేమచంద్ర రెడ్డిని వైస్ చైర్మన్ ఉమామహేశ్వరిదేవిని అలాగే సెకరెటరీ వై.నజీర్ అహ్మద్ ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా యూనివర్సిటీలోని వివిధ విభాగాలు వాటి పనితీరు, వాటిని



ఎలా ముందంజలోకి తీసుకెళ్లాలి అనే విషయాల గురించి చర్చించారు.

రైతులకు పీఎం కిసాన్‌పై అవగాహన

ప్రజాశక్తి-కోట: కోట మండలంలోని కేశవరం పంచాయతీ పరిధిలో ఉన్న పలువురు రైతులకు పిఎం కిసాన్, ఈకేవైసీలపై, కౌలుపత్రాల పంపిణీ పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శుక్రవారం మండల పరిధిలోని కేశవరం గ్రామంలో అర్హులైనవారికీ పీఎం కిసాన్ కు ఈ కేవైసీ పూర్తి చేయడానికి ఈ నెల చివరి వరకు సమయాన్ని పొడిగించడంతో రైతులకు అవగాహన కల్పిస్తూ కౌలు పత్రాలు అందజేసే విధానాన్ని రైతులకు తెలియజేశారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ప్రసాద్ రావు, వ్యవసాయ సహాయ సంచాలకులు తిరుపతి ధనుంజయ రెడ్డి, నాయుడుపేట



వ్యవసాయ సహాయ సంచాలకులు డి. ఉమా, మండల వ్యవసాయ అధికారి వి.నిరంజన్ కుమార్, తదితర వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

చుక్కల భూములకు పట్టాల పంపిణీ

ప్రజాశక్తి-చిల్లకూరు: చుక్కల భూములకు పట్టాల పంపిణీ చేసిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎమ్మెల్యే వరప్రసాద్, ఎమ్మెల్సీ మురళీ అన్నారు. శుక్రవారం చిల్లకూరు మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయ ప్రాంగణంలో చుక్కల భూములకు పట్టాలను అందించారు. తిరుపతి జిల్లా డీఆర్వో, గూడూరు ఆర్డీవో కిరణ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఇకపై సదరు భూమి రిజిస్ట్రేషన్ అవుతుందని.. క్రయవిక్రయాలు జరుపుకోవచ్చని రెవెన్యూ అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పిటిసి మన్యం శ్రీనివాసులు, చిల్లకూరు పిఎసిఎస్ అధ్యక్షులు



చేవూరు నాగరాజు, సర్పంచ్ నాగిశెట్టి శారదమ్మ, ఎమ్మార్వో శ్రీనివాసులు, కోట, వాకాడు, గూడూరు తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు లోకేష్ ఎంపిక



ప్రజాశక్తి-వి.కోట: మండల పరిధిలోని ఎర్రినాగేపల్లికి చెందిన యశ్వంత్ కుమారుడు లోకేష్ నవోదయ పాఠశాలకు ఎంపికయ్యాడు. లోకేష్ ఎంపికపై గ్రామస్థులు గతంలో ప్రధాన ఉపాధ్యా యుడుగా పనిచేసిన యుటిఎఫ్ అనుబంధం విభాగ ఉపాధ్యాయుడైన కృష్ణమూర్తి విద్యార్థిని అభినందించారు.

నేడు మండల కార్యాలయంలో ట్రాక్టర్ల వేలం

ప్రజాశక్తి-శాంతిపురం: శాంతిపురం మండల కార్యాలయం ఆవరణలో గత కొన్నేళ్లుగా నిరుపయోగంగా మారి తుప్పు పట్టిన రెండు ట్రాక్టర్లను మండల పరిషత్ అనుమతితో చిత్తూరు మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో శనివారం వేలం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏఎస్ హేమమాలిని ఓ ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటల నుండి ఈ వేలం పాట ప్రారంభమవుతుందని ఆమె ప్రకటనలో పేర్కొన్నారు. రూ.20 వేలు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

వేడుకగా అర్జున తపస్సు



ప్రజాశక్తి-పెనుమూరు: పర్యాటక కేంద్రమైన పులిగుండు వద్ద జరుగుతున్న మహా భారత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్జున తపస్సు కార్యక్రమం వేడుకగా జరిగింది. వైసీపీ పార్టీ మండల అధ్యక్షులు మహాసముద్రం సురేష్ రెడ్డి, ఆలయ ధర్మకర్త ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ఉత్సవాలకు పరిసర గ్రామాల నుండి వందలాదిగా ప్రజలు తరలివచ్చారు.

నిందితుడిపై పోక్సో కేసు నమోదు



ప్రజాశక్తి- వరదయ్యపాలెం: వరదయ్యపాలెం మండలం సీఎల్ఎన్.పల్లికి చెందిన ఓ బాలిక (16) ను మరదవాడకు చెందిన వీరారాఘవులు అనే కిరణ్ (22) యువకుడు ప్రేమిస్తున్నానని.. పెళ్లి చేసుకుంటానని మాయమాటలు చెప్పి నమ్మించి ఇటీవల బాలికను అపహరించి పరారయ్యాడు. దీనిపై బాలిక తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన సీఐ శివకుమార్‌రెడ్డి ఆదేశాలతో ఎస్సై నాగార్జున రెడ్డి దర్యాప్తు చేసి ఈ నెల 22వ తేదీ అపహరణకు గురైన బాలికను గుర్తించారు. వారి తల్లిదండ్రులకు అప్పగించారు. పరారీలో ఉన్న నిందితుడు వీరారాఘవులును శుక్రవారం అరెస్ట్ చేసి రిమాండ్ కు పంపారు.

చెరువులో గుర్తుతెలియని మృతదేహం

ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి పంచాయతీలోని చెరువు పంట కాలువ వద్ద శుక్రవారం గుర్తుతెలియని మృతదేహం లభ్యమైంది. నెలవాయి వీఆర్వో మురళీ కథనం మేరకు.. రెండు రోజుల క్రితమే మృతిచెంది ఉండటంతో గుర్తుపట్టలేని విధంగా ఉన్నాడు. 40 సంవత్సరాల వయసు ఉండి గోధుమరంగు నిలువు గీతలు చొక్కా, బ్లూ జీన్స్ ప్యాంటు, బ్రౌన్ రంగు బెల్ట్ ధరించి ఉన్నాడు. ఎవరికైనా ఆచూకీ తెలిస్తే కింది నంబర్లకు తెలపాలని సీఐ విక్రమ్, ఎస్సై మంజునాథ రెడ్డి తెలిపారు.

రహదారుల క్లియరెన్స్ లబ్ధిదారులకు డబ్బులు చెల్లించాలి

ప్రజాశక్తి-చిత్తూరుఅర్బన్ : జిల్లాలో బెంగళూరు - చెన్నై, చిత్తూరు - తచ్చూరు రోడ్లు అభివద్ధికి సంబంధించి క్షేత్రస్థాయిలో అవసరమైన చోట్ల అవార్డ్స్ పాస్ చేయాలని, క్లియరెన్స్ అయిన వాటికి సంబంధించి పెండింగ్ లేకుండా లబ్దిదారులకు డబ్బులు అందజేయాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్ సమావేశంలో జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు, డిఆర్ఓ, యన్. రాజశేఖర్‌తో కలసి జిల్లాలో జరుగుతున్న యన్ హెచ్, ఎక్స్ప్రెస్ వే ప్రాజెక్టులు, అభివద్ది పనులకు సంబంధించి యన్ హెచ్ ఏ ఐ,పిడీలు, ఉద్యాన, వ్యవసాయ, ఈ ఈ, ఆర్ అండ్ బి, ఈ ఈ ఇరిగేషన్, విద్యుత్, ఫారెస్ట్ సెటిల్మెంట్ , గ్రామీణ నీటి సరఫరా, అటవీ, రైల్వే అధికారులు, ఆర్డీఓలు, తహశీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో బెంగళూరు - చెన్నై- చిత్తూరు - తచ్చురు జాతీయ రహదారుల అభివద్ధి పనులకు సంబంధించి క్షేత్రస్థాయిలో సమస్యలు ఉంటే వెంటనే పరిష్కరించాలని, అవసరమైన వాటికి అవార్డ్స్ పాస్ చేయాలని, క్లిరెన్స్ అయిన వాటికి సంబంధించి పెండింగ్ లేకుండా లబ్దిదారులకు డబ్బులు అందజేయాలని సంబంధితా ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించారు. బెంగళూరు - చెన్నై, ఎన్ హెచ్-140, బెంగళూరు - చెన్నై ఎక్స్ప్రెస్ హైవే ఫేస్ - 2, ప్యాకేజీ - 1. 147 లకు సంబంధించి బంగారుపాలెం - పలమనేరు ప్యాకేజీ-2, బంగారుపాలెం- గుడిపాల ప్యాకేజీ-3, పురోగతిలో ఉన్న సమస్యలు పరిష్కరించాలని,గుడిపాల మండలం,వసంత పురం గ్రామం నందు అటవీ భూమికి సంబంధించి క్లిరెన్స్ చేయాలని అటవీ శాఖ అధికారుల కు చూచించారు. చెన్నై -బెంగుళూరు ఎక్స్ప్రెస్ హై వే లో భాగంగా వి.కోట, బైరెడ్డిపల్లి మండలం పథదిలో బైపాస్ రోడ్డు ఏర్పాటు కు భూముల కు సంబంధించిన 3 డి ప్రతిపాదనలు సిద్ధంచేయాలని పలమనేరు ఆర్డీఓ ను ఆదేశించారు. విజయపురం, నగరి మండలాల లో భూములు, బోర్లు నష్టపోయిన లబ్దిదారులకు చిత్తూరు, నగరి ఆర్డీఓలు, తహసీల్దార్లు సమన్వయం చేసుకొని లబ్దిదారులకు డబ్బులు చెలించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైల్వే ప్రాజెక్టు సంబంధించి కుప్పం - గుడు పల్లి మండల పరిధిలోని గ్రామాల వారిగా ప్రభుత్వ, డికెటి భూములకు సంబంధించి ఉన్న సమస్యలను ఈ నెల ఆఖరుకు కల్లా పరిశీలించాలన్నారు. జులై 1 నుండి లబ్దిదారులకు డబ్బులు పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని కుప్పం ఆర్డీఓ ను ఆదేశించారు.



గంగమ్మను దర్శించుకున్న భరత్‌రెడ్డి



ప్రజాశక్తి- తొట్టంబేడు: రామచంద్రాపురం గంగమ్మ జాతరకు నేషనల్ కన్స్యూమర్ రైట్స్ కమిషన్ కలవగుంట భరత్ రెడ్డి హాజరయ్యారు. రామ చంద్రపురం గ్రామం చల్లగా ఉండాలని.. అందరూ సుఖ సంతోషాలతో ఉండేలా చూడాలని అమ్మవారిని వేడుకున్నారు. ముందుగా గ్రామస్తులు భరత్ రెడ్డికి ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో షబ్బీర్ బాష, ధన శేఖర్, మోహన్, అబ్బు, సతీష్, గోవింద్ స్వామి, రమేష్, వెంకటేష్, సుభాన్, సయ్యద్, ఫరూక్, రాము, మస్తాన్, లితీష్, ముని, సుబ్బయ్య, రఘు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుడు జయరామయ్య మృతికి నివాళులు



ప్రజాశక్తి-దొరవారిసత్రం: గతంలో దొరవారిసత్రం మండలంలోని అక్కరపాక, తనయాలి ప్రాథమికోన్నత పాఠశాలల్లో హిందీ ఉపాధ్యాయులు గా పని చేసి ప్రస్తుతం నెల్లూరు రూరల్ మండలంల పనిచేస్తున్న కోగిలి జయరామయ్య (స్వగ్రామం అక్కరపాక) గురువారం మధ్యాహ్నం నారాయణ హాస్పిటల్‌లో మతి చెందాడు. శుక్రవారం విద్యాశాఖాధికారి క్రిష్ణయ్య ఆయన భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

అంకాలమ్మ జాతరలో అన్నదానం



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: గేట్ పుత్తూరు, కామ రాజ్‌నగర్‌లోని వాల్మీకి వీధిలో వెలసిన శ్రీఅంకా లమ్మ జాతర వేడుకలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా గేట్ పుత్తూరులోని భక్తులకు తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షులు డీజీ ధనపాల్ కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రధాన కార్యదర్శి ఎన్ ఎన్ ధనపాల్, మోహన్ రాయల్, శ్రీనివాసులు, నటరాజన్, సాయి, మహేష్, చంద్ర, చైతన్య, సుధీర్, సాయి లోకేష్, మునేంద్ర, భాస్కర్, హరి, చిన్నబ్బా, సత్య, భక్తులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ విరివిగా మొక్కలు పెంచాలి



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వడమాలపేట మండల పరిధిలోని శ్రీ బొమ్మరాజపురం గ్రామ పంచాయతీలో సర్పంచ్ మణిరాజు మొక్కలు నాటే కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. గ్రామంలో కాలుష్యాన్ని నివారించి, పర్యావరణాన్ని కాపాడాలన్న ఉద్దేశంతో కిలోమీటర్ మేరకు రోడ్డుకు ఇరువైపులా 250 మొక్కలు నాటించారు. ఉప సర్పంచ్ రవి, పెద్దబ్బరాజు, శంకర్, శివ యాదవ్, సాయి యాదవ్ ఉపాధి కూలీలు తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీ ఆర్ట్స్ కళాశాలలో

అంతర్జాతీయ ఒలంపిక్ డే

ప్రజాశక్తి - క్యాంపస్ : ఎస్వీ ఆర్ట్స్ కళాశాల డిపార్ట్మెంట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం అంతర్జాతీయ ఒలంపిక్ డే సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ టి.నారాయణమ్మ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 23వ తేదీన అంతర్జాతీయ ఒలంపిక్ డేని నిర్వహించుకుంటామని తెలిపారు. ఈ ఒలంపిక్ ఈవెంట్లో దాదాపు 400 కంటే ఎక్కువ ఆటగాళ్లు 200 కంటే ఎక్కువ దేశాల నుండి క్రీడాకారులు పాల్గొంటారని తెలిపారు. ప్రతి విద్యార్థిని విద్యార్థులు క్రీడల్లో పాల్గొని చదువులోనూ ఇతర విషయాలలో నైపుణ్యం కలిగి దేశానికి, చదువుకునే విద్యాసంస్థలకు మంచి పేరు తెచ్చి ఉత్తమ పౌరులుగా ఎదగాలన్నారు. ఎస్ వి ఆర్ట్స్ కళాశాల ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ ఎస్ ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ 23 జూన్ 1894 అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీ ఏర్పడిన జ్ఞాపకార్థం జనవరి 1948 లో ఒలంపిక్ దినోత్సవం జరుపుకోవడానికి అంతర్జాతీయ ఒలంపిక్ కమిటీ ఆమోదం తెలిపింది. అప్పటి నుండి ప్రతి సంవత్సరం జూన్ 23న ఒలంపిక్ డే జరుపుకుంటున్నారు అని తెలిపారు. అనారోగ్యానికి దూరంగా ఉంచడంతో వ్యక్తిగత, సామాజిక పురోగతిని సాధిస్తారని తెలిపారు. తెలుగు విభాగాధిపతి డాక్టర్ ఎన్. భీమన్న మాట్లాడుతూ ఒలంపిక్ క్రీడలు ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి జరుగుతాయి. వేసవి ఒలంపిక్స్ క్రీడలు, నాలుగు సంవత్సరాలలో ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి శీతాకాలం ఒలంపిక్స్ గేమ్స్ ప్రత్యేకంగా ఉంటాయి. దేశాల మధ్య శాంతి, మానవత్వం ఉండేలా అంతర్జాతీయ ఒలంపిక్స్ ను ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు డాక్టర్ పి భాస్కరుడు డాక్టర్ ఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



డెంగ్యూ జ్వరాల నియంత్రణకు పటిష్ట చర్యలు

కమిషనర్ డా. జె అరుణ



ప్రజాశక్తి చిత్తూరుఅర్బన్ : నగరంలో డెంగ్యూ జ్వరాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు నగర కమి షనర్ డా. జె అరుణ చెప్పారు. శుక్రవారం ఉదయం కమిషనర్ నగరంలోని 8వ వార్డు పరిధిలోని కుమార్ నగర్ కాలనీలో జిల్లా మలేరియా అధికారులతో కలిసి పర్య టించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాలు జరుగుతున్న తీరును తనిఖీ చేశారు. నివాస గృహాలను సందర్శించి లార్వాలను గుర్తించారు. దోమల వల్ల కలిగే వ్యాధులు, నియంత్రణపై స్థానిక ప్రజలకు అవగాహన కల్పించాలని, ప్రతివారం ఫ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం కట్టమంచి, దుర్గా నగర్ కాలనీ, గంగినేని చెరువులో దోమ లార్వాల నియంత్రణకు గంబూజియా చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ... నగరంలో గత ఏడాది డెంగ్యూ జ్వరాల కేసులు నమోదయాయని, ఇందుకోసం దోమ లార్వాల నియంత్రణ చర్యల్లో భాగంగా చెరువుల్లో గంబూజియా చేపలను వదిలినట్లు చెప్పారు. ఈ చేపలు దోమ లార్వాలను ఆహారంగా తీసుకుంటాయని, దీంతో దోమల వద్ధి గణనీయంగా తగ్గుతుందన్నారు. ఇదే సమయంలో మేజర్, మైనర్ డ్రైనేజీ కాలువలను శుభ్రం చేయిస్తున్నామని, స్ప్రేయింగ్ విస్తతంగా చేయించడం ద్వారా ఈ ఏడాది డెంగ్యూ జ్వరాలను గణనీయంగా తగ్గించేందుకు చర్యలు చేపట్టామని వివరించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ సన్ని షర్మిల పత్రి, జిల్లా మలేరియా అధికారి శ్రీనివాసులు, సబ్ యూనిట్ అధికారి పీరూ సాహెబ్, ఎంహెచ్వో డా లోకేష్, శానిటరీ ఇన్స్పెక్టర్లు చిన్నయ్య, లోకనాథం, నరసింహ వార్డ్ కార్యదర్శులు పాల్గొన్నారు.

అంగన్వాడీ కార్యకర్తలకు అనీమియాపై అవగాహన

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: క్షేత్ర స్థాయిలో ఐసిడిఎస్ సూపర్వైజర్లకు అంగన్వాడీ కార్యకర్తలకు అనీమియా లెవెల్స్‌పై అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ సగిలి షన్మోహన్ పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా సచివాలయంలోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ మెడికల్ ఆఫీసర్లు తో ఎన్‌సిడిసిడి సర్వే 0-5 మధ్య పిల్లల జనన ధవీకరణ పత్రాల మంజూరు, ఆధార్ నమోదు, ఐసిడిఎస్ సీడీపీవోలు సూపర్వైజర్లుకు సంబంధించి సంబంధిత అంశాలపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ..జిల్లాలో 0-5 సంవత్సరాల పిల్లలందరికీ జనన ధవీకరణ పత్రాలు ఇచ్చే సమయంలోనే పిల్లల పేరుతో పొందేలా అంగన్వాడీ కార్యకర్తలు, సూపర్వైజర్లు, సిడిపిఓ లు కషి చేయాలని.. తద్వారా ఆధార్ నమోదు ప్రక్రియను త్వరితగతిన చేసేందుకు వీలు అవుతుందని తెలిపారు. సమావేశంలోఇన్చార్జి డిఎం అండ్ హెచ్ఓ రాజశేఖర్ రెడ్డి, డి సి హెచ్ ఎస్ డాక్టర్ నాయక్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ కిరణ్మయి, ఐసిడిఎస్ పిడి నాగ శైలజ, మెడికల్ ఆఫీసర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

జీతాల కోసం క్లాప్ ఆటో డ్రైవర్ల నిరసనలు

ప్రజాశక్తి-చిత్తూరు అర్బన్: క్లాప్ ఆటో డ్రైవర్లకు రెండు నెలల జీతాలను వెంటనే ఇవ్వాలని కోరుతూ చేపడుతున్న నిరసనలు శుక్రవారం మూడో రోజు మున్సిపల్ గ్యారేజ్ ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ నాయకులు గౌరవ సలహా దారులు విసి గోపినాథ్, ఏఐటియుసి చిత్తూరు జిల్లా నాయకులు దాసరి చంద్ర మాట్లాడారు.

శ్రీరామ్ ఫైనాన్స్ ఆధునీకరణ షోరూం ప్రారంభం

ప్రజాశక్తి - చిత్తూరుఅర్బన్: స్థానిక కొంగారెడ్డిపల్లి శ్రీరామ్ ఫైనాన్స్ అధునీకరించిన బ్రాంచ్‌ను శ్రీరామ్ ఫైనాన్స్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ హంజ అలి ప్రారం భించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విలువైన వాహనాల కొనుగోలు, పారిశ్రామిక ఏర్పాటు ఇతర వాణిజ్య అవసరాల కోసం శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ తక్కువ వడ్డీతో బుణాలు ఇవ్వను న్నట్లు తెలిపారు. కొనుగోలు దార్లకు ఆర్థిక చేయుతను అందిస్తు సుదీర్ఘ కాలంగా శ్రీరామ్ ఫైనాన్స్ కంపెనీ ప్రజల ఆదరణ పొందుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శ్రీరామ ఫైనాన్స్ అధ్యక్షులు రామకృష్ణ, జిఎం భవాని శంకర్, డిజిఎం సుధాకర్‌రెడ్డితో పాటు శ్రీ రామ్‌ఫైనాన్స్ సిబ్బంది పాల్గొన్నారు.